
# నేటి తరం

తెలుగు దినపత్రిక — అన్నీ వాస్తవాలే






సోమవారం మే 25, 2026 | సంపుటి :03 సంచిక : 304 | Hyderabad,,karimnagar,khammam,Nalgonda,Nizamabad, Warangal,Mahabubnagar,Rangareddy,Medak,Adilabad | సంపాదకులు : బొమ్మ అమరేందర్ | పేజీలు : 08 వెల –6– | Follow : www.netitharam.com


# బొద్దింక సృష్టిస్తున్న భూకంపం!?

## నోరుంది కదా? అని మాట్లాడితే జరిగేది | వ్యవస్థల మీద నోరు పారేసుకుంటే అంతే!

- ఒక్క ట్విట్టర్ అకౌంట్ దేశాన్ని ఊపేస్తుంది.
- యూత్‌లో సునామీని సృష్టించింది.
- సర్వోన్నత న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు తెచ్చిన దుమారమిది!
- కాలు జారినా తీసుకోగలేమేమో కాని నోరు జారొద్దని పెద్దలు ఊరికే అనలేదు.
- యువతను రెచ్చగొడితే రాజ్యాలే కూలిపోయాయి!
- న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు బిజేపి మెడకు చుట్టుకున్నాయి.
- బిజేపి రాజకీయంలో కల్లోలం రేపుతున్నాయి!
- దేశమంతా బొద్దింక ప్రకంపనలు మొదలయ్యాయి.
- జెన్‌జీ తడాకా చూపిస్తున్నాయి..వ్యవస్థల మీద ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.
- ప్రతి పదేళ్లకు ఇలాంటివి వస్తూనే వుంటాయి. రాజకీయాలను మార్చేస్తుంటాయి.
- 2013లో నమో మంత్రం దేశమంతా పాకింది. బిజేపి అధికారంలోకి వచ్చింది.
- ఆనాడు యూత్ అంతా బిజేపికి అండగా నిలిచింది. కాంగ్రెస్‌ను ఓడిచింది.
- సాఫీగా సాగుతున్న బిజేపి రాజకీయంలో బొద్దింక అలజడి సృష్టిస్తోంది.
- నీట్ పరీక్ష పేపర్ లీక్ బొద్దింకకు కలిసి వచ్చింది.

ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూ ఊహించెదరో..అని తెలుగులో ఓ పాట వుంది. అది రాజకీయాలకు సరిగ్గా వర్తిస్తుంది. అన్నీ బాగానే వున్నాయని అనుకున్నప్పుడు అలజడులు చలరేగుతాయి. ఇప్పుడు దేశంలో కూడా బొద్దింక ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇది పాలపొంగులా చల్లారుందా? లేక సునామీలా రాజకీయాల మీద పడిపోతుందా? అనేది కొద్ది రోజులు ఆగితే గాని చెప్పలేం. కాని ఇప్పటికైతే దేశంలో బొద్దింక భూకంపం సృష్టిస్తోంది. చిన్న నిప్పు రవ్వ అడవిని దహించినట్లు, దేశ సర్వోన్నత న్యాయాదీశుడు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశమంతా అంటుకున్నాయి. యువతకు ఆగ్రహాన్ని తెప్పించాయి. ఆయన అన్యాపదేశంగా అన్నారా? లేక కావాలనే అన్నారా? అనే దానిపై సుప్రిం ప్రధాన న్యాయమూర్తి వివరణ ఇచ్చారు. తాను ఎవరినీ ఉద్దేశించి అన్నది కాదన్నారు. కాని అది అప్పటికే దావానలంలా పాకిపోయింది. దేశమంతా విస్తరించింది. బొద్దింక రూపంలో నిరసన మొదలైంది. అయినా సుప్రింకోర్టు న్యాయమూర్తి కావాలంటే లా చదవాల్సిందే. ముందు లాయర్ కావాల్సిందే. న్యాయం గెలవాలంటే, న్యాయం బతకాలంటే లాయర్లు వుండాల్సిందే. దేశం మొత్తం మీద కొన్ని లక్షల సంఖ్యలో కేసులు కొన్ని దశాబ్ధాలుగా పెండింగ్‌లో వుంటున్నాయి. వాటికి పరిష్కారం కోసం ఆలోచించాల్సిన న్యాయమూర్తులు, న్యాయవాదులను తప్పు పట్టడంలో అర్ధం లేనిది. పైగా యువతను నిందిస్తే లాభం లేదు. యువత నిరుద్యోగులుగా ఎందుకు మారుతున్నారు. చదవుకున్న యువకులకు ఎందుకు ఉపాది కల్పన జరగడం లేదు. ఉద్యోగాలు ఎందుకు రావడం లేదు. అయినా దేశంలో గత దశాబ్ధ కాలంగా యువత అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. పొట్ట నింపుకునేందుకు దొరికిన పని చేస్తున్నారు. కాని ఏనాడు పాలకులను యువత నిందించడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే సర్ధుకుపోతున్నారు. అందులో కొంత మంది కనీస ఉపాది లేక అల్లాడుతున్నారు. అయినా ఎక్కడా ప్రభుత్వాలను పెద్దగా ప్రశ్నించడం లేదు. సైలెంట్‌గా వున్న యువతను కెలికితే ఎలా వుంటుందో చరిత్రలో అనేక సాక్ష్యాలున్నాయి. యువత దేశానికి బొద్దింకలుగా మారి, పరాన్న జీవులైపోతున్నారని సాక్ష్యాత్తు సుప్రింకోర్టు ప్రధాన న్యాయమూర్తే అంటే, న్యాయం ఎలా జరుగుతుంది. యువతకు ఉద్యోగాలు కల్పించాలని చెప్పాల్సిన స్ధానంలో వున్నవారు యువతను ఎగతాళి చేయడం ఏమిటి? ఆ న్యాయమూర్తి తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని ఎంత సమర్ధించుకున్నా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. యువత మేలుకొన్నది. తమ హక్కుల కోసం పోరాటం చేయాలన్న కసి మొదతలైంది. రాజకీయాలను నిలదీయాలనుకుంటున్నారు. వ్యవస్ధలను ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందంటున్నారు. ఏది ఏమైనా ఇలాంటి కుదపు ఒకటి వస్తుందని పాలకులు ఊహించలేదు. ముఖ్యంగా బిజేపి నాయకులు అనుకోలేదు. అయినా బిజేపి నాయకులు ఎందుకు అతిగా స్పందిస్తున్నారో అర్ధం కావడంలేదు. బొద్దింక వస్తే ముందుకు బిజేపి ఎందుకు ఉలిక్కిపడిందో తెలియడం లేదు. సరిగ్గా ఇదే సమయంలో నీట్ పరీక్ష పత్రం లీక్ కావడం అనేది జెన్‌జీకి కలిసి వచ్చింది. అంతే దేశమంతా ఉద్యమాలు మొదలు పెడుతున్నారు. బొద్దింక జనతా పార్టీ అనేది నిజానికి ఒక రాజకీయ పార్టీ కాదు. కేవలం నెటిజన్ల కోసం పెట్టిన ట్విట్టర్ ఎకౌంట్. అది ఒక్కసారిగా ఇంటర్ నెట్‌ను కుదిపేసింది. నాలుగైదు రోజుల్లోనే మిలియన్లు దాటిపోయింది. బిజేపి పార్టీ ఫాలోవర్లను మించిపోయింది. అంతే రాజకీయ పార్టీలలో వణుకు మొదలైంది. అయినా బొద్దింక ఇంత వేగంగా విస్తరిస్తుందని ఎవరూ అనుకోలేదు. నాలుగైదు రోజుల్కో సునామీ సృష్టిస్తుందని ఎవరి ఊహకు అందలేదు. నిరుద్యోగులు, యువత తల్చుకుంటే ఏదైనా సాదిస్తారని చెప్పడానికి ఇదే నిదర్శనం. 2013 కూడా నమో మంత్రం కూడా ఇలాగే వచ్చింది. దేశమంతా మార్పు కోరుకున్నది. కాంగ్రెస్‌కు చరిత్రలోలోని పరాజయాన్ని కట్టబెట్టింది.. ఆ సమయంలో బిజేపి యువతకు ఇచ్చిన హామీలలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు అనేది పెద్ద ప్రభావం చూపింది. అంతే బిజేపి చరిత్రలోనే ఎన్నికల సునామీ సృష్టించింది. సొంత మెజార్టీతో అధికారంలోకి వచ్చింది. తర్వాత దేశమంతా విస్తరించింది. హిందూ బావన అందరిలోనూ మెదిలింది. దేశం కోసం, ధర్మం కోసం అనే నినాదం బిజేపికి ఆయువు పట్టుగా నిలిచింది. ఇంత వరకు బాగానే వుంది. కాని పాలన అంటే కేవలం నినాదాలు కాదు. ఎన్నికల ముందు చేసే వాగ్ధానాలే కాదు. వాటి అమలు అనేది పాలకులు మర్చిపోయారు. ప్రతి దానికి ఒకటే మంత్రం వేసుకుంటూ వెళ్లారు. సమాజం నుంచి ప్రశ్న లేకుండా చేసుకున్నారు. సమాజం ఏం కోరుకుంటుందో తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. తాము చెప్పిందే జనం ఆశిస్తున్నారు అనే పద్దతిలో బిజేపి నేతలు సాగుతూ వచ్చారు. కాని ప్రజల్లో గూడుకట్టుకొని వున్న ఆందోళన ఒక్కసారిగా పెల్లుబికినట్లైంది. ఎన్నికల కమీషన్ ఏం చేప్పినా విన్నారు. బిజేపి నేతలు ఏం సూచించినా అనుసరించారు. కాని న్యాయ వ్యవస్థ నుంచి వచ్చిన వ్యాఖ్యలు పెను దుమారం రేపాయి. బొద్దింకను తెరమీదకు తెచ్చి రాజకీయాలను భయపెడుతున్నాయి.



## ఉష్ణోగ్రతలు

| | కనిష్ఠ | గరిష్ఠ |
|---|---|---|
| Hyderabad | ~32 °C | ~43°C |
| Warangal | ~31 °C | ~43 °C |
| Karimnagar | ~32 °C | ~43 °C |
| Rangareddy | ~34 °C | ~41 °C |
| Khammam | ~34 °C | ~39 °C |
| Mahabubnagar | ~34 °C | ~42 °C |
| Nalgonda | ~33 °C | ~41 °C |
| Nizamabad | ~34 °C | ~39 °C |

## కోడిగుడ్ల ధరలు

హెూల్‌సేల్ నెక్ / రిటైల్-

**Hyderabad**

Per piece: ₹ 5.35
Per 100 pieces: ₹ 535
Per dozen: ₹ 64.2

**warangal**

Per piece: ₹ 5.37
Per 100 pieces: ₹ 537
Per dozen: ₹ 64.44

# ఆల్చిప్పల కోసం నదిలో దిగి..

## ఒకే కుటుంబంలోని 8మంది మృతి



బెంగళూరు : కర్ణాటకలోని తత్తెహక్కలు నదిలో వేటకు దిగిన ఒకే కుటుంబానికి చెందిన 11 మంది గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. జాలర్ల సాయంతో 8మంది మృతదేహాలను వెలికితీశారు. మృతుల్లో 7మంది మహిళలు, ఒకరు పురుషుడు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో నదిలో ఆల్చిప్పలు విరివిగా దొరుకుతాయి. దీంతో భత్కళ తాలూకా సిరాలి గ్రామానికి చెందిన ఓ కుటుంబం (14మంది) ఉదయం 10గంటల సమయంలో ఆల్చిప్పల కోసం నదిలోకి దిగారు. అదే సమయంలో నది ప్రవాహం పెరగడంతో వారిలో ముగ్గురు కొట్టుకుపోయారు. వారిని రక్షించడానికి ప్రయత్నిస్తుండగా మిగిలిన వారు కూడా ప్రవాహంలో కొట్టుకుపోయారు. వెంటనే స్థానిక జాలర్లు నదిలోకి దిగి ముగ్గురిని రక్షించారు. అప్పటికే మిగిలిన వారు గల్లంతయ్యారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు

# ప్రభుత్వ పథకాలపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం

## • జూన్ 2 నుంచి ఇందిరమ్మ బీమా అమలు

- 1.06 కోట్ల కుటుంబాలకు లబ్ధి
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం ఆరోపణ
- ఇంటింటి ప్రచారానికి ప్రభుత్వం సిద్ధం
- కేసీఆర్‌పై భట్టి తీవ్ర విమర్శలు
- పేదలకు ఉచిత సన్నబియ్యం పంపిణీ
- 53 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి లబ్ధి
- విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం
- రైతుల ప్రతి గింజ కొనుగోలు చేస్తామన్న భట్టి
- మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు
- రూ.లక్ష కోట్ల రుణాల లక్ష్యంపై హామీ



రాష్ట్ర అవతరణ వేడుకను పురస్కరించుకుని జూన్ రెండో తేదీ నుంచి ఇందిరమ్మ బీమా పథకాన్ని అమలు చేస్తున్నామని, తద్వారా రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టేందుకు త్వరలో ఇంటింటి ప్రచారం చేపడతామన్నారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇస్తే, అనంతరం అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రజా సంక్షేమాన్ని పక్కనబెట్టి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు.

స్తంభాద్రి పట్టణాభివృద్ధి సంస్థ (సుడా), ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన ఛైర్మన్‌లుగా బాధ్యతలు చేపట్టిన పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖాదర్‌బాబాల అభినందన సభ ఆదివారం ఖమ్మం నగరంలోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంటే అదికాస్తా తమ కుటుంబానికే ప్రయోజనం చేకూరేలా కేసీఆర్ చేసుకున్నారని విమర్శించారు. మహిళలకు వడ్డీలేని రుణాలిస్తామని చెప్పిన భారాస ప్రభుత్వం మొండిచెయ్యి చూపిందన్నారు. కాంగ్రెస్ కండువా వేసుకొని గెలిచిన నాటి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, కందాళ ఉపేందర్‌రెడ్డి, హరిప్రియలు తమతో మాట్లాడుతూనే అప్పటి అధికార పార్టీలోకి చేరారన్నారు. ఉన్నత స్థానంలో ఉన్నవారు పార్టీలు మారారు తప్ప జెండాలు మోసే కార్యకర్తలెవరూ తమను వీడలేదన్నారు. వారందరికి ప్రస్తుతం పార్టీలో, ప్రజా ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మిగతాద్ది 3 లో




### తెలంగాణ సర్కార్

# కీలక నిర్ణయం

- తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం
- బీసీ కులాల పేర్ల మార్పుకు ఆమోదం
- బీసీ కమిషన్ సిఫారసుతో నిర్ణయం
- బుడబుక్కల - శివ క్షత్రియ
- వన్నార్ - ధోబీగా మార్పు
- రజక, చాకలి, ధోబీ పేర్ల వినియోగానికి అనుమతి
- దొమ్మర - గడ వంశీయ
- పిచ్చకుంట్ల - వంశరాజ్
- వీరభద్రియకు కొత్త పేర్ల చేర్పు
- మేర కులం పేరు మార్పు
- శూద్ర - తమ్మలి గా మార్పు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్: వెనుకబడిన తరగతుల్లోని కొన్ని కులాల పేర్లు ఇబ్బందికరంగా ఉన్న అంశాన్ని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ కులాల పేర్ల మార్పునకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర బీసీ కమిషన్ సిఫారసు మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.బీసీ కులాల్లో గ్రూప్--ఏ లోని వరుస సంఖ్య 4లో ఉన్న బుడబుక్కల కులాన్ని శివ క్షత్రియగా మార్పు చేశారు. ఇదే కేటగిరీలోని వన్నార్‌ను తొలగించి ధోబీగా మార్పు చేసి రజక, చాకలి, ధోబీగా.. ఏదైనా ఒక పేరును వాడుకలోకి తీసుకోవచ్చన్నారు. వరుస సంఖ్య 7లోని దొమ్మర అనే పదాన్ని తొలగించి గడ వంశీయగా మార్పు చేశారు. వరుస సంఖ్య 18లో ఉన్న పిచ్చకుంట్ల పేరును వంశరాజ్‌గా మార్పు చేశారు. వరుస సంఖ్య 23లో ఉన్న వీరభద్రియను వీరముష్టి, నెట్టి కోటల, వీరభద్రియగా మార్చారు. గ్రూప్ డీ, వరుస సంఖ్య 5లో ఉన్న మేర కులం పేరును మేరుగా మార్పు చేశారు. వరుస సంఖ్య 29లో ఉన్న శూద్ర కులం పేరును తొలగించి తమ్మలిగా మార్చారు.



## “అప్పటివరకు ‘నీట్’పై నిరసనలు జరుగుతూనే ఉంటాయి”

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ నీట్ ప్రశ్నపత్రం లీక్ వివాదంపై కేంద్రంపై తీవ్ర విమర్శలు చేశారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ అనిశ్చితిలో ఉండగా ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఆదివారం ఎక్స్‌లో ఈ మేరకు రాహుల్ గాంధీ ఎన్ఎస్‌యూఐ నిరసన తెలిపిన ఓ వీడియోను పోస్ట్ చేశారు.

3 లో




## ఐఎస్ఐలో చేరేందుకు యత్నం.. మేడ్చల్‌లో యువకుడి అరెస్టు

మేడ్చల్: ఉగ్రవాద గ్రూపుల్లో చేరేందుకు ప్రయత్నిస్తున్న యువకుడిని మేడ్చల్ పోలీసులు అరెస్టు చేశారు. అతడిని యూపీలోని గాజియాబాద్‌కు చెందిన జయిుద్‌ఖాన్‌గా గుర్తించారు. మేడ్చల్‌లోని ముబారక్ హోటల్‌లో పని చేస్తున్న అతడు..

### మొక్క జొన్న కొనుగోళ్లపై

# సీఎం కీలక నిర్ణయం

- మొక్కజొన్న కొనుగోళ్లపై సీఎం కీలక నిర్ణయం
- కేంద్రం స్పందించకపోవడంతో రాష్ట్రం ముందుకు
- అదనంగా రూ.1800 కోట్లు కేటాయింపు
- భారీ దిగుబడులతో కొనుగోళ్లకు సిద్ధం
- రూ.1100 కోట్లతో కొనుగోలు ప్రక్రియ
- జిల్లాల వారీగా ఏర్పాట్లకు ఆదేశాలు
- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- పొద్దుతిరుగుడు కొనుగోళ్లపై సీఎం ఆదేశాలు
- రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం



హైదరాబాద్: మొక్క జొన్న కొనుగోళ్లపై కేంద్రం స్పందించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం ఇప్పటికే కేటాయించిన రూ.4వేల కోట్లకు అదనంగా మరో రూ.1800 కోట్లు.. సీఎం కేటాయించారని చెప్పారు. ఈ ఏడాది రబీ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్రంలో మొక్కజొన్న భారీ దిగుబడుల వచ్చిన నేపథ్యంలో సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. రూ.1100 కోట్లతో మొక్క జొన్న కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. పొద్దుతిరుగుడు పంట 25 శాతానికి మించి కొనుగోలు చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు మంత్రి తుమ్మల ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాల వారీగా మొజొన్న కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. రైతుల ప్రయోజనాలే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తుమ్మల స్పష్టం చేశారు.



3లో..

## ప్రొఫెసర్ నాగేశ్వర్ రావుపై కేసులు ఉపసంహరించుకోండి

### - ఏపీ సర్కార్ ను కోరుతూ హరీష్ రావు ట్వీట్

ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు సీఎం చంద్రబాబు, జగన్ లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఏపీ పాలిటిక్స్ లో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. కేసులు నమోదు చేసేవరకు వెళ్ళింది వ్యవహారం. ఈ క్రమంలో మాజీ మంత్రి హరీష్ రావు ఎక్స్ వేదికగా కీలక ట్వీట్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ రావుపై నమోదు చేసిన కేసులు ఉపసంహరించుకోవాలని ఏపీ సర్కార్ ను కోరుతూ ట్వీట్ చేశారు హరీష్ రావు.

## కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నారు : కేటీఆర్

- కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ఫైర్
- ప్రజల్లో కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత
- బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధం
- హైడ్రా, మూసీ పేరుతో ఇళ్లు కూల్చివేత ఆరోపణ
- ఫ్యూచర్ సిటీపై రేవంత్‌ను ప్రశ్నించిన కేటీఆర్
- బీఆర్ఎస్‌లో పని చేసేవారికే గుర్తింపు
- సర్వేల ఆధారంగా టికెట్ల కేటాయింపు
- ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపు ధీమా
- రైతులు ఇబ్బందులు పడుతున్నారన్న కేటీఆర్
- బీజేపీ ఓట్ల తొలగింపుపై కుట్ర ఆరోపణ
- ప్రజా సమస్యలపై పోరాటం చేసిన వారికే టికెట్లు




రాష్ట్రంలో పాలనను కాంగ్రెస్ గాలికొదిలేసిందని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఆదివారం అంబర్‌పేటలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. కేటీఆర్ మాట్లాడుతూ..రాష్ట్రంలో పాలనను కాంగ్రెస్ గాలికొదిలేసింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు పీకల్లోతు కోపం ఉంది. కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నారు.

మిగతాద్ది 3 లో

### ప్రభుత్వానికి చెడ్డపేరు

# తెచ్చేలా వ్యవహరించవద్దు

- రాష్ట్రంలో 8,575 కొనుగోలు కేంద్రాలు
- 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు
- రైతులకు రూ.45 వేల కోట్లు చెల్లింపు
- తరుగు మోసాలపై కఠిన చర్యలు
- అధికారులకు మంత్రి హెచ్చరిక
- తడిసిన ధాన్యమూ కొనుగోలు
- 21 కోట్ల గన్నీ బ్యాగులు సిద్ధం
- బ్యాగుల కొరత లేదన్న మంత్రి
- రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవు



హైదరాబాద్: రాష్ట్రంలో 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. 51 లక్షల టన్నుల ధాన్యం కొని రైతులకు చెల్లింపులు చేశామని చెప్పారు. ఈ ఒక్క ఏడాదిలోనే వరి రైతులకు రూ.45వేల కోట్లు చెల్లించామన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. “తరుగు పేరుతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా అధికారులు వ్యవహరించవద్దు. వర్షాలతో ధాన్యం తడిచినా కొనాల్సిందే. ఫీల్డ్‌లో 21 కోట్ల గన్నీ బ్యాగులు ఉన్నాయి.. వాటికి కొరత లేదు” అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.

# లాయర్ మొయిజుద్దీన్ హత్య కేసులో నిందితుల అరెస్ట్



3లో..

హైదరాబాద్: న్యాయవాది మొయిజుద్దీన్ హత్య కేసులో నిందితుల్ని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. గోవాలో నలుగురు నిందితుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కబాడిగూడాకు చెందిన వినయ్ అనే వ్యక్తి కారుతో ఢీకొట్టినట్లు గుర్తించారు పోలీసులు. దీనిలో భాగంగా గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు..



3లో..

## అమెరికా వెళ్లిన ఇంటి యజమాని.. అందినకాడికి దోచుకున్న దొంగలు

హైదరాబాద్ : ఇంటి యజమాని అమెరికా వెళ్లడంతో ఇద్దరు దొంగలు అందినకాడికి దోచుకెళ్లారు. నగరంలోని కాప్రా సర్కిల్ సైనిక్‌పురిలో ఈ ఘటన చోటుచేసుకుంది.

# ఐఎస్ఐలో చేరేందుకు యత్నం.. మేడ్చల్‌లో యువకుడి అరెస్టు

రెండోవపేజీ తరువాయి

ఇన్‌స్టాగ్రామ్‌లో ఉగ్రవాద సంస్థలను ఫాలో అవుతున్నాడు. కొన్నాళ్లుగా ఉగ్రముఠాలను కలిసేందుకు ప్రయత్నిస్తున్నాడు. పాక్ ఐఎస్ఐలోనూ చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. జయీద్‌ఖాన్ సామాజిక మాధ్యమాలపై నిఘా పెట్టి పట్టుకున్నారు. అతడి నుంచి నకిలీ తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్ రావుపై కేసులు ఉపసంహరించుకోండి

రెండోవపేజీ తరువాయి

బీజేపీకి చంద్రబాబు ఇన్స్టంట్ ఫ్రెండ్, జగన్ లాంగ్ టర్మ్ ఫ్రెండ్ అని పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ తో అమిత్ షా అన్నారని.. ఈ విషయాన్ని పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ సమావేశంలో అన్నారంటూ ఓ ఛానల్ డిబేట్ లో చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యలపై జనసేన, టీడీపీ శ్రేణులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఈ క్రమంలో ఏపీలో పలు చోట్ల నాగేశ్వర్ రావుపై కేసులు కూడా నమోదయ్యాయి.

ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు తాను చేసిన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించినప్పటికీ కక్షపూరిత ధోరణితో కేసులు నమోదు చేసి వేధించడం సరికాదని...వెంటనే ఈ కేసులను ఉపసంహరించుకోవాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరుతున్నానంటూ ట్వీట్ చేశారు హరీష్ రావు.

# ప్రభుత్వ పథకాలపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం

రెండోవపేజీ తరువాయి

దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యాన్ని పేదలకు ఉచితంగా అందిస్తున్నామని, గృహజ్యోతి పథకం కింద 53 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించనున్నట్లు వివరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మక్కలు కొనుగోలు చేస్తున్నట్లు, రైతులు పండించిన ప్రతి గింజనూ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. రైతుల సమస్యలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎప్పటికప్పుడు మంత్రిమండలి సమావేశాల్లో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని గుర్తుచేశారు. ఇదీ మన అభివృద్ధి అని ప్రతి ఒక్కరూ చెప్పుకొనేలా ప్రభుత్వం ముందుకెళ్తున్నట్లు వివరించారు. మహిళా సంఘాలకు ఏటా రూ.20వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, దీన్ని రూ.లక్ష కోట్ల వరకు పెంచుతామని భట్టి హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నారు : కేటీఆర్

రెండోవపేజీ తరువాయి

హైడ్రా, మూసీ పేరుతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు. ఉన్న నగరాన్నే సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదు. ఇలాంటి నాయకుడు ఫ్యూచర్ సిటీ నిర్మిస్తాడంటే నమ్మాలా?. బీఆర్ఎస్‌లో పనిచేసే వారికే గుర్తింపు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సర్వేల ఆధారంగానే టికెట్లు. బీఆర్ఎస్‌లో పని చేసేవారికే గుర్తింపు.రాష్ట్రంలో ఎప్పుడూ ఎన్నికలు జరిగిన బీఆర్ఎస్‌దే గెలుపు. సర్వేల ఆధారంగానే టికెట్లు ఇస్తాం. ఎస్ఐఆర్‌పై అందరూ అప్రమత్తంగా ఉండాలి. కాంగ్రెస్ పాలనలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాసమస్యలపై పోటారం చేసిన వాళ్లకే టికెట్లు. కొందరి ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్రలు చేస్తోంది'అని ఆరోపించారు.

# "అప్పటివరకు 'నీట్'పై నిరసనలు జరుగుతూనే ఉంటాయి"

రెండోవపేజీ తరువాయి

"లక్షలాది మంది యువత రోడ్లపై ఉన్నారు.. 22 లక్షల పిల్లల భవిష్యత్ ఏంటో తెలియట్లేదు. అయినా ప్రధాని మౌనంగా ఉన్నారు. ఈ ప్రభుత్వం సమాధానం చెప్పడంపై కాదు, బాధ్యత నుంచి తప్పించుకోవడంపైనే దృష్టి పెట్టింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు, నీట్ లాంటి ప్రశ్నపత్ర లీకులు ఆగేలా పూర్తిస్థాయి భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేసే వరకు మేము ఆగము" అని రాహుల్ గాంధీ అన్నారు.

నీట్ ప్రశ్నపత్రం లీక్ అంశం దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసింది. విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడటంలో ప్రధాని మోదీ ప్రభుత్వం విఫలమైందని, "ప్రశ్నపత్ర లీక్ మాఫియా" పెరగడానికి అవకాశం ఇచ్చిందని కాంగ్రెస్ ఆరోపించింది.

ఎక్స్‌లో కాంగ్రెస్ ట్వీట్ చేస్తూ.. "నీట్ ప్రశ్నపత్ర లీక్ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌ను చీకటిలోకి నెట్టింది. మోదీ ప్రభుత్వ హయాంలో ప్రశ్నపత్ర లీక్ మాఫియా విస్తరిస్తోంది. బాధ్యులు మాత్రం మౌనంగా చూస్తున్నారు. హైదరాబాద్‌లో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వినోద్ జాఖర్ నాయకత్వంలో కార్యకర్తలు పాదయాత్ర చేపట్టి, యువత వ్యతిరేక మోదీ ప్రభుత్వానికి గట్టిగా హెచ్చరిక ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్‌తో చేసే ఈ చెలగాటాన్ని ఏ మాత్రం సహించం. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని కాంగ్రెస్ పేర్కొంది.

అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ప్రశ్నపత్ర లీక్ కేసులో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

ఇదిలా ఉండగా, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా సభ్యులు ఆదివారం హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. నీట్ ప్రశ్నపత్ర లీక్ అంశంపై ఆందోళన వ్యక్తం చేశారు.

నిరసనకారులు కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నీట్ అక్రమాల్లో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# లాయర్ మొయిజుద్దీన్ హత్య కేసులో నిందితుల అరెస్ట్

రెండోవపేజీ తరువాయి

ఈ హత్య కేసుకు సంబంధించి వినయ్‌తో సహా నలుగుర్ని అరెస్ట్ చేశారు.

కాగా, శనివారం(మే 23వ తేదీ) నగరంలోని మాసబ్‌ట్యాంక్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది.. ప్రముఖ న్యాయవాది కాజా మొయినుద్దీన్‌ను గుర్తుతెలియని దుండగులు కారుతో ఢీకొట్టి హత్య చేసిన ఘటన సంచలనం రేపుతోంది. శనివారం ఉదయం ఆయన తన నివాసం నుంచి కారులో బయల్దేరుతున్న సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ధుండగులు కారుతో ఢీ కొట్టి అటాక్ చేశారు.

ఈ ప్రమాదంలో మొయినుద్దీన్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఘటన తర్వాత నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. దాడికి సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. దీని ఆదారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# రైతులకు ఆధునిక టెక్నాలజీల ను అందించాలి

**డిమాండ్ ఉన్న పంటలనే రైతులు సాగు చేయాలి**
**వ్యవసాయ వర్సిటీలో విత్తన వారోత్సవాలు ప్రారంభించిన మంత్రి తుమ్మల**

భవిష్యత్ వ్యవసాయ రంగంలో కూలీల సమస్య అధికమయ్యే అవకాశం ఉన్నందున డ్రోన్స్ వినియోగం ప్రాముఖ్యతని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేసారు. తదనుగుణం గా వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన డ్రోన్ ఆధారిత వివిధ వ్యవసాయ విధానాల్ని మంత్రి అభినందించారు. రాజేంద్ర నగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈరోజు పర్యటించారు. తొలుత మంత్రి గత ఏడాది స్థాపించిన సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్, టెక్నాలజీ ని సందర్శించి ఆధునిక డ్రోన్స్ వినియోగం పై చేస్తున్న పరిశోధన ల గురించి తెలుసుకున్నారు. అదే విధంగా ఇటీవల అభివృద్ధి చేసిన రోబోటిక్స్ మరియు సెన్సర్ బేస్డ్ ప్రయోగశాలని సందర్శించి ఇప్పటికే కొన్ని రోబోలని వ్యవసాయ రంగం లో ఉపయోగించే విధంగా అభివృద్ధి చేసినందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలని మంత్రి అభినందించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వానికి అందించిన ఉపగ్రహ ఆధారిత గణాంకాల గురించి తెలుసుకున్నారు. రాష్ట్రం లోని రైతాంగం యాజమాన్యం పరిధి లో ఉన్న మొత్తం భూమి లో సుమారు 9.3 శాతం భూమి సాగు లో లేదని ఈ సందర్బంగా మంత్రికి వివరించారు. 99 రోజుల ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక లో భాగం గా వ్యవసాయ విశ్వవిద్యాలయం తలపెట్టిన విత్తన వారోత్సవాలు కార్యక్రమాన్ని మంత్రి లాంఛనం గా ప్రారంభించి పది మంది రైతులకు వివిధ పంటలకి చెందిన నాణ్యమైన మూల విత్తనాలని పంపిణీ చేశారు. విశ్వవిద్యాలయం ఈ కార్యక్రమం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం

చాలా అభినందనీయం అని మంత్రి అన్నారు.కొన్ని విత్తన కంపెనీల మాయ మాటలకి మోసపోకుండా రైతులు ఈ నాణ్యమైన విత్తనాలు వినియోగించి తక్కువ ఖర్చు తో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అదే విధంగా రైతులు మార్కెటింగ్ అవకాశాలు ఉన్న పంటలనే సాగు చేయాలని, పంట మార్పిడి విధానాలని అనుసరించాలన్నారు. 60 ఏళ్ల క్రితం ఏర్పాటు అయిన ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సహా అనేక మంది మహానుభావుల తోడ్పాటు తో దేశం లో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించిందని మంత్రివర్యులు అభిప్రాయపడ్డారు.గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి తోడ్పాటు తో విశ్వవిద్యాలయం ఇంకా పురోగతి సాధిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు నిరంతరం రైతుల తో మమేకం అయి వారికి కావలసిన పరిష్కారాలు అందించా లన్నారు. అదే విధంగా ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న అనేక అదునాతన టెక్నాలజీ లని విశ్వవిద్యాలయం రైతాంగానికి అందుబాటులోకి తీసుకొని రావాలని మంత్రి విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలకి సూచించారు. సాగుకు కీలకం అయిన నాణ్యమైన విత్తనాలని రైతాంగానికి అందించాలనే ఉద్దేశం తో గత ఏడాది నుంచి ఈ విత్తన పంపిణి కార్యక్రమం చేపట్టామని వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉప కులపతి అల్దాస్ జానయ్య తెలిపారు. కార్యక్రమం లో పరిశోధన సంచాలకులు డాక్టర్ మరాఠి బలరామ్,డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ నీలిమ, డాక్టర్ వెంకటేశ్వర్లు,డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డాక్టర్ వై.చంద్రమోహన్ శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కండువాలు కప్పకుంటున్న పోలీసులు రాష్ట్రంలో శాంతిభద్రతలు నశించాయయి

పోలీసులు కాంగ్రెస్ కండువాలు కప్పుకొని తిరుగుతున్నారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు. పోలీస్ స్టేషన్లు కాంగ్రెస్ పార్టీ నాయకులకు అడ్డాగా మారాయని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్త మధు అంత్యక్రియల్లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచకాలు పెరిగిపోయాయని జగదీశ్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు నశించాయని అన్నారు. ఇప్పటివరకు తమ జిల్లాలో ఇద్దరు కార్యకర్తలను పొట్టన బెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులకు శిక్షలు పడేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. 2018లో జరిగిన బీఆర్ఎస్ నాయకుడి హత్య కేసులో కీలక సాక్షిగా ఉన్న మధును కాంగ్రెస్ నాయకులు అనేకసార్లు బెదిరించారని తెలిపారు. ఓ పోలీసు అధికారి స్వయంగా పిలిచి నువ్వు ఎగిరిపోతావని బెదిరించాడని పేర్కొన్నారు. ఈ హత్య పోలీసు అధికారులకు తెలిసే జరిగిందని అన్నారు. అందుకే మధును ముందే పోలీసు అధికారి హెచ్చరించారని చెప్పారు. పోలీసోళ్లు బెదిరిస్తున్నారని చెబితే జాగ్రత్తగా ఉండమని చెప్పానని.. కానీ ఏదో పంచాయతీ ఉందని పిలిచి మధును హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మా కార్యకర్తను హత్య చేసిన నిందితులను ఇప్పటివరకు అరెస్టు చేయలేదని తెలిపారు. కాంగ్రెస్ గూండాల చేతిలో దారుణమైన హత్యకు గురైన మా కార్యకర్త మధు కుంటుంబ పోషణ బాధ్యత, పిల్లల చదువుల బాధ్యత బీఆర్ఎస్ పార్టీనే తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కేసులో ఏ అధికారి తప్పు చేసినా మేము గమనిస్తూనే ఉంటామని తెలిపారు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఆ అధికారి తప్పించుకోలేడని హెచ్చరించారు. ఇలాంటి క్రిమినల్ కేసులు పదేండ్ల తర్వాత కూడా ఓపెన్ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయని తెలిపారు. తప్పు చేస్తే ఐజీ, డీజీ స్థాయి అధికారులను కూడా వదిలేది లేదని స్పష్టం చేశారు. అది దృష్టిలో పెట్టుకొని పోలీస్ అధికారులు విచారణ చేయాలని సూచించారు.

# ఫ్యూచర్ సిటీని అడ్డుకోవడం .. అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే

**– ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్**

హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. రెండున్నరేళ్లలో ఇండ్లు కూల్చడమే కానీ.. అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకోవడం అంటే మీ అక్రమార్క ప్రణాళికను అడ్డుకోవడమే అని అన్నారు. ఫార్మాసిటీని కొనసాగిస్తామని కోర్టుకు ఎందుకు చెప్పారని ప్రశ్నించారు. ఫార్మా సిటీ కోసం మాత్రమే రైతులు భూములు ఇచ్చారని దేశపతి శ్రీనివాస్ తెలిపారు. మీ భూదందాల కోసం రైతులు భూములు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఫార్మాసిటీని రద్దు చేసిన భూములు తిరిగి ఇచ్చేస్తామని గతంలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పలేదా అని ప్రశ్నించారు. మీ స్వార్థ ప్రయోజనాల కోసం ఫార్మాసిటీ భూముల్ని మళ్లిస్తారా అని మండిపడ్డారు. మీ విధ్వంసాన్ని చక్కదిద్దే బాధ్యత మాపై ఉందని వ్యాఖ్యానించారు.

# గురుకులాల కిరాణ కొనుగోళ్లలో అవినీతి

**– రేవంత్ రెడ్డికి దాసోజు శ్రవణ్ బహిరంగ లేఖ**

గురుకులాల కిరాణ కొనుగోళ్లలో అవినీతి జరుగుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ల వ్యవస్థను పక్కనబెట్టడం తీవ్ర అవమానకరమని ఆయన వ్యాఖ్యానించారు. ఐఏఎస్ అధికారులపై ప్రభుత్వానికి నమ్మకం లేదా అని ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి దాసోజు శ్రవణ్ బహిరంగ లేఖ రాశారు. రూ.100 కోట్ల కమీషన్ల కోమే మూడు నెలల టెండర్ల విధానానికి మంగళం పాడారని దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఏడాది కాలపరిమితి టెండర్లతో ప్రభుత్వ ఖజానాకు వందల కోట్లు గండి కొట్టే ఎ÷-లాన్ చేశారని మండిపడ్డారు. తెలంగాణ బ్రాండ్ తాండూర్ కందిపప్పునకు మంగళం పాడి.. ఆఫ్రికా నాసిరకం పప్పులతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.165 కోట్ల టర్నోవర్ నిబంధనతో స్థానిక చిన్న వ్యాపారులు, మహిళా సంఘాల గొంతు నొక్కడమే అని వ్యాఖ్యానించారు. కేంద్రీకరణ మేలైతే ప్రైవేటు కాంట్రాక్టర్లు ఎందుకు అని ప్రశ్నించారు. మార్క్‌ఫెడ్ ద్వారా నేరుగానే కొనుగోలు చేయవచ్చు కదా అని నిలదీశారు. అధికారులకు రాబోయే కేసీఆర్ ప్రభుత్వంలో న్యాయ విచారణ తప్పదని హెచ్చరించారు.

# అవగాహన లేకుండా పొంగులేటి ఆరోపణలు

**రియల్ మాఫియా చేతుల్లో మంత్రి**
**ఫ్యూచర్ సిటీ అక్రమాలకు అడ్డా అన్న దాసోజు**

బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన అహంకారపూరిత, అవహేళన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు

శ్రవణ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర గానీ, ఇక్కడి ప్రగతి ప్రస్థానం గానీ తెలియని పొంగులేటి.. ఒక బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి నిస్సిగ్గుగా, చిల్లర జ్యోతిష్యాలు చెప్పడం హాస్యాస్పదమని మండిపడ్డారు. మా పొలిటికల్ ఫ్యూచర్ గురించి మాట్లాడే నైతిక అర్హత నీకెక్కడిది పొంగులేటి అని మండిపడ్డారు. సలు నీ ఫ్యూచర్ ఏంటో నీకు తెలుసా.. త్వరలోనే మీ అవినీతి లీలలన్నీ బట్టబయలై, జైలు ఊచలు లెక్కబెట్టడమే నీ ఫ్యూచర్ అని వ్యాఖ్యానించారు. మీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన తాత్కాలిక అవినీతి సామ్రాజ్యాన్ని బద్దలు కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు. నువ్వు చేస్తున్న అక్రమాలు, వెనుక ఉండి నడిపిస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియా దందాలకు.. నీ ఫ్యూచర్ మరో రెండేళ్లు దాటితే చర్లపల్లి జైల్లోనే ఉంటుంది. రాసి పెట్టుకో అని హెచ్చరించారు. పదేళ్లలో ఒక్క మెట్రో స్టేషన్ కూడా కట్టలేదని బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడానికి సిగ్గుండాలని అన్నారు. అసలు కళ్ళు ఉండి చూస్తున్నావా, లేక అధికార అహంకారంతో కళ్ళు పూర్తిగా మూసుకుపోయాయా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయి మెట్రో ప్రాజెక్టును తెచ్చి, రికార్డు సమయంలో ఫేజ్-1 పూర్తి చేసి చూపించింది నాటి కేసీఆర్ ప్రభుత్వం అని గుర్తుచేశారు. హైటెక్ సిటీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో ఫేజ్-2 కి సంబంధించిన అన్ని ప్రణాళికలు, రూట్ మ్యాప్‌లను సిద్ధం చేస్తే.. ఈరోజు అధికారంలోకి వచ్చిన మీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రద్దుచేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ కాదు.. అది 'ఫేక్' సిటీ.. ల్యాండ్ మాఫియా అడ్డా అని దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. ప్రపంచ దేశాలు మెచ్చేలా, ఉపాధి కల్పనే ధ్యేయంగా నాడు కేసీఆర్ తెచ్చిన గ్రీన్ ఫీల్డ్ ఫార్మా సిటీని రద్దు చేసి.. ఈరోజు 'ఫ్యూచర్ సిటీ' అనే రంగుల ప్రపంచం పేరుతో మీరు చేస్తోంది ఏంటని ప్రశ్నించారు. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం పేద ప్రజల, గిరిజనుల, రైతుల నోళ్లు కొట్టి వారి భూములను అక్రమంగా లాక్కోవడమే మీ ఫ్యూచర్ సిటీ వ్యూహమా? అని నిలదీశారు. ఫ్యూచర్ సిటీ ముసుగులో వేల కోట్ల రూపాయల అవినీతికి, ల్యాండ్ పూలింగ్ స్కామ్‌లకు తెరలేపారని అన్నారు. నాదర్‌గుల్, లగచర్లలో రైతులను బెదిరించి, వారిపై దాడులు చేసి అక్రమ కేసులు బనాయించి, వారిని వేధిస్తున్న మీ నిరంకుశత్వంపై ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని అన్నారు. మీ భూ కబ్జాలు, మీ ఊఎఒ÷ఖ పాలసీ పేరుమీద ఇండస్ట్రియల్ మాఫియా దందాలన్నీ త్వరలోనే ఆధారాలతో సహా బట్టబయలు చేస్తామని హెచ్చరించారు. మీ అక్రమ పాలనకు, దగాకోరు రాజకీయాలకు ఇంకో రెండేళ్లు మాత్రమే గడువు ఉందని దాసోజు శ్రవణ్ హెచ్చరించారు. ఎంత ఎంజాయ్ చేస్తావో చేసుకో, ఎంత దోస్తావో దోచుకో పొంగులేటి.. ఆ తర్వాత ప్రజల పక్షాన ప్రతి పైసా లెక్క తేలుస్తాం.. మీ నుండి కక్కిస్తామని అన్నారు. మిమ్మల్ని చర్లపల్లి జైలు ఊచలు లెక్కపెట్టించడం ఖాయమని వ్యాఖ్యానించారు.

# అమెరికా వెళ్లిన ఇంటి యజమాని.. అందినకాడికి దోచుకున్న దొంగలు

రెండోవపేజీ తరువాయి

కుషాయిగూడ పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.సైనిక్‌పురిలోని హస్తినాపురికి చెందిన సీహెచ్ విజయలక్ష్మి (68) భర్త మృతిచెందడంతో ఒంటరిగా నివసిస్తోంది. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారిద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు. విజయలక్ష్మి నెల క్రితం ఇంటికి తాళం వేసి అమెరికాలో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లింది. ఆమె వద్ద పనిచేస్తున్న పనిమనిషి యశోదమ్మ ఆదివారం ఉదయం వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దీంతో ఈ విషయాన్ని ఆమె అమెరికాలో ఉన్న యజమాని, బంధువులకు సమాచారం అందించింది. బీరువాలోని మూడు తులాల బంగారం, కేజీ వెండి, రూ.5,000 నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. విజయలక్ష్మి సోదరుడు వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఇద్దరు దొంగలు ఇంట్లోకి ప్రవేశించినట్లు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయింది. దుండగులు కాళ్లకు ఒకే రకం బూట్లు, ముఖానికి మాస్కులు ధరించి ఉన్నారు. చోరీ అనంతరం దొంగలు కారులో పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు.

# సహజీవనం.. మహిళ నాలుక కోసి పారిపోయిన ప్రియుడు



కాప్రా: సహజీవనం చేస్తున్న వ్యక్తి.. మహిళ నాలుకను కోసి పారిపోయిన సంఘటన హైదరాబాద్‌లోని కుషాయిగూడ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై కె.సతీశ్ తెలిపిన ప్రకారం.. కుషాయిగూడకు చెందిన మహిళ (50) భర్త చనిపోయి పదేళ్లైంది. నవీన్ అనే వ్యక్తి పరిచయం కావడంతో ఆరు నెలలుగా అతడితో సహజీవనం చేస్తోంది. ఈ నెల 22న అర్ధరాత్రి ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన నవీన్ చాకుతో మహిళ నాలుకను కోసి పారిపోయాడు. స్థానికులు ఆమెను గాంధీ ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు శస్త్రచికిత్స చేశారు. బాధిత మహిళ ప్రస్తుతం కోలుకుంటోంది. ఆమె కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

# చెట్టును ఢీకొన్న బైక్.. ఇద్దరు యువకుల మృతి




సంగారెడ్డి జిల్లా కొండాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో విక్రమ్ (27), అనిల్ (30) మృతి చెందారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# లిఫ్ట్ ఇస్తామని నమ్మించి దోపిడీకి పాల్పడిన నిందితుడు అరెస్ట్:

- కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం
- కారు కిరాయికి తీసుకొని దొంగతనాలు పాల్పడుతున్న యువత అరెస్ట్
- మైనర్ అని తెలిసి కారు కిరాయికి ఇచ్చిన యజమాని పైన కేసు నమోదు

**వర్గల్ మే 24, (నేటి తరం)**
రాజీవ్ రహదారిపై ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని, లిఫ్ట్ ఇస్తామని నమ్మించి దోపిడీకి పాల్పడుతున్న ముఠాను గౌరారం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల నుండి చోరీ సొత్తుతో పాటు నేరానికి ఉపయోగించిన డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నారు.కేసు వివరాలు తెలియపరుస్తూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శశి రంజన్ సింగ్ (24) బషీర్‌బాగ్‌లో నివసిస్తూ ట్రాన్స్‌పోర్ట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 22న రాత్రి 12 గంటల ప్రాంతంలో ఆయన పాతూరులోని బేయర్స్ క్రాప్ సైన్స్ కంపెనీలో పని ముగించుకుని, సికింద్రాబాద్ వెళ్లేందుకు ప్రజ్ఞాపూర్ బస్ స్టాప్ వద్ద వేచి ఉన్నాడు.అదే సమయంలో సిద్దిపేటకు చెందిన ప్రధాన నిందితుడు వొలుసుల అలీఖేష్ (25) తన ముగ్గురు మైనర్ సహచరులతో కలిసి ఎనసానపల్లికి చెందిన రాజు అనే వ్యక్తి వద్ద TS08GW8840 నంబర్ గల స్విఫ్ట్ డిజైర్ కారును సెల్ఫ్ డ్రైవింగ్‌కు కిరాయికి తీసుకుని దొంగతనం కోసం తిరుగుతున్నారు. బస్ స్టాప్ వద్ద ఒంటరిగా ఉన్న శశి రంజన్ సింగ్‌ను గమనించి, తాము కూడా సికింద్రాబాద్ వైపు వెళు_న్నామని నమ్మబలికి కారు ఎక్కించుకున్నారు. కారు కొంతదూరం వెళ్లిన తర్వాత గౌరారం గ్రామ శివారులోని ముట్రాజ్ పల్లి చౌరస్తా వద్ద రాజీవ్ రహదారి పక్కన ఆపారు. బాధితుడిని



బెదిరించి అతని వద్ద ఉన్న బ్యాగు, రూ. 200 నగదు, మరియు వివో (VIVO Y56) మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కుని, అతడిని కారులోంచి కిందకు నెట్టేసి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గౌరారం పోలీసులు కేసు నమోదు చేశారు.

**పోలీసుల దర్యాప్తు – నిందితుల అరెస్ట్**
సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఆదేశల మేరకు,గజ్వేల్ రూరల్ సర్కిల్ సీఐ రవి రాజు పర్యవేక్షణలోశగౌరారం ఎస్సై ఆరోగ్యం సిబ్బంది మహేందర్ రెడ్డి, విష్ణు చందర్, పర్శరాములులతో కూడిన ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది.రహదారిపై ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి కారు నంబర్ ఆధారంగా ఎన్సాన్ పల్లికి చెందిన యజమాని రాజును విచారించారు. నిబంధనలకు విరుద్ధంగా, మైనర్లను గమనించకుండా రోజుకు రూ. 3,500 చొప్పున ఆశపడి కారును కిరాయికి ఇచ్చినట్లు అతడు అంగీకరించాడు.నిందితుల పట్టుబడుట సాంకేతిక పరిజ్ఞానం, ఫోన్ నంబర్ల ఆధారంగా నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నిందితుల నేరచరిత్ర: ప్రధాన నిందితుడు వొలుసుల అలీఖేష్‌పై గతంలో సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గంజాయి కేసు, టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రాత్రి వేళల్లో దొంగతనాల కేసులు ఉన్నాయి. అలాగే రెండవ నిందితుడైన (మైనర్) పై గతంలో పోక్సో (POCSO) కేసు ఉన్నట్లు విచారణలో తేలిందిస్వాధీనం చేసుకున్న సొత్తు నేరానికి ఉపయోగించిన స్విఫ్ట్ డిజైర్ కార్ (TS08GW8840)

- బాధితుడి బ్యాగ్, రూ. 200 నగదు
- బాధితుడి వివో (VIVO Y56) మొబైల్ ఫోన్
- నిందితులు వాడిన 3 మొబైల్ ఫోన్లు

ప్రధాన నిందితుడు వొలుసుల అలీఖేష్‌ను రిమాండ్‌కు తరలించారు. మైనర్లకు, నేర చరిత్ర గలవారికి కారును కిరాయికి ఇచ్చిన కారు యాజమాని రాజుపై కూడా మోటార్ వాహనాల చట్టం కింద కేసు నమోదు చేశారు.

సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు, వాహనాలను కిరాయికి ఇచ్చే యజమానులు ఖచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. వాహనం తీసుకునే వారి గుర్తింపు పత్రాలు, ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్ క్షుణ్ణంగా పరిశీలించి, నమ్మకస్థులైన వారికే వాహనాలు ఇవ్వాలి. నిబంధనలు ఉల్లంఘించి మైనర్లకు, అపరిచితులకు వాహనాలు ఇస్తే వారిపై కూడా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు హెచ్చరించారు.

# వైకుంఠధామం లో 'నీరు లేదు... నీడ లేదు'..

- ముదిమాణిక్యం, ముల్కనూర్, గ్రామాల్లో పైకప్పు లేని వైకుంఠధామాలు
- అధికారులు పర్యవేక్షించి మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్న గ్రామాల ప్రజలు



**చిగురుమామిడి,మే 24 ( నేటి తరం )**
తెలంగాణలో పల్లె ప్రగతిలో భాగంగా ప్రతిష్టాత్మకంగా ముది మాణిక్యం, ముల్కనూర్ మరియు మండలంలోని గ్రామాలలో నిర్మించిన వైకుంఠధామాలు (శ్మశానవాటికలు) నీరు, విద్యుత్ వంటి కనీస వసతులు లేక, నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి.ఒక్కొక్క వైకుంఠ ధామానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ.12.50 లక్షలు ఖర్చుపెట్టి నిర్మించిన వినియోగంలోకి రావడం లేదు.లక్షల రూపాయలతో నిర్మించినా, ఊరికి దూరంగా ఉండటం, పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజలు పాత పద్ధతులనే పాటిస్తున్నారు.వైకుంఠధామాల్లో నీటి సరఫరా, విద్యుత్ కనెక్షన్లు లేవు.పారిశుధ్యం లేకపోవడం, మొక్కలు పెరగడం,రేకులు,గోడలు.కూలిపోవడం.అధికారుల,గ్రామ పంచాయతీల పర్యవేక్షణ వల్ల నిరుపయోగంగా వైకుంఠధామాలు మారాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామపంచాయతీ పాలకవర్గం స్పందించి వైకుంఠధామాలు ఉపయోగంలోకి తీసుకురావాలనే మండల ప్రజలు కోరుతున్నారు.

**స్మశాన వాటిక దుస్థితి దారుణం**

స్మశాన వాటికలో కట్టిన గదులు కూలిపోయే స్థితిలో ఉన్నాయి. స్నానం చేసే సౌకర్యం లేదు మృతదేహాలను ఉంచడానికి తగిన ప్రదేశం లేక ప్రజలు తీవ్ర ఆవేదంలో ఉన్నారు. స్మశాన వాటికను పట్టించుకునే నాధుడే లేదని గ్రామస్తులు వాపోతున్నారు ఈ స్మశానానికి వెళ్లే ప్రజలు కార్యక్రమం అనంతరం స్నానం చేయాలన్న సమీప ఊర్ల దగ్గర చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. గ్రామంలో ప్రధానంగా ఉన్న సమస్యలపై అధికారుల దృష్టి పడకపోవడం ప్రజలను బాధ కలిగిస్తుంది.

**మౌలిక వసతులు అందించాలని అన్ని గ్రామాల ప్రజలు విజ్ఞప్తి**

పేరుకే ప్రతి గ్రామానికి స్మశాన వాటిక కానీ మౌలిక వసతులు సరిగా లేవని ప్రజల ఆరోపిస్తున్నారు. స్మశాన వాటికను తక్షణమే చుట్టు గోడ, పైకప్పు, స్నానపు గదుల సౌకర్యం ఏర్పాటు చేయాలని గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా తనిఖీ




**గజ్వేల్ మే 24,( నేటి తరం)**
ఆదివారం గజ్వేల్ పట్టణంలోనీ వ్యవసాయ మార్కెట్ కమిటీ లో ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు సజావుగా సాగుతుందని, ఏ ఏం సి లలో వరి తో పాటు మక్కలు కూడా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.మక్కలు, వరి ఒకే సారి రావడం వలన హమాలీ, లారీల కొరత ఏర్పడిందని ఈ సమస్యలు అధిగమించడానికి బయట రాష్ట్రాల నుండి హమాలీ కాకుండా స్థానిక గ్రామాల్లో హమాలీలను సెంటర్ లలో ఉంచాం, లారీల కొరత తీర్చడానికి కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ఎక్కువ ధాన్యం ఉన్న సెంటర్ లకు ప్రాధాన్యత కల్పిస్తూ గత కొన్ని రోజులుగా కొనుగోలు సజావుగా జరిగేలా అదికార యంత్రాంగం పని చేస్తుందని తెలిపారు.ధాన్యం నిలవచేయడానికి స్థల కొరత వలన ఏ ఏం సి లలో గోదాం మరియు షెడ్ లను ఉపయోగించి అందులో ధాన్యాన్ని దిగుమతి చేస్తున్నామని తెలిపారు. గోదాంలో దిగుమతి వలన ట్రాన్స్పోర్ట్, ధాన్యాన్ని వెంటనే లిఫ్ట్ చేస్తున్నామని తెలిపారు.ప్రభుత్వం రైతులు పండించిన పంట చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని, కొనుగోలులో వేగం పెంచడంలో అధికార యంత్రాంగానికి సహకరించాలని జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.

# డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని హరీష్ రావుకు వినతి

- అధికారులు మారుతున్నా తీరని సమస్యలు
- కార్యాలయాలకు వెళ్తే లబ్ధిదారులను మనుషులుగా కూడా చూడట్లేదు
- గజ్వేల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నర్సింగ్‌రావు



**గజ్వేల్ మే 24 (నేటి తరం)**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారుల సమస్యల పరిష్కారం కోసం మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావుకు వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో లబ్ధిదారులు ఆదివారం హరీష్ రావును కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల సమస్యలపై సంబంధిత అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని మండిపడ్డారు. అధికారులు మారుతున్నా లబ్ధిదారుల సమస్యలు మాత్రం అక్కడే వేలాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తమ సమస్యలను అధికారులకు విన్నవించుకుందామని కార్యాలయాలకు వెళితే, అక్కడి సిబ్బంది లబ్ధిదారులను కనీసం మనుషుల లాగా కూడా చూడడం లేదని ధ్వజమెత్తారు. నివసించే ఇండ్ల మధ్యే స్మశాన వాటిక ఉండటం, చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోవడంతో లబ్ధిదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇంకా పూర్తిగా లబ్ధిదారులందరికీ అందజేయలేదు. అలాగే లబ్ధిదారులందరికీ ఇండ్ల పట్టాలు పంపిణీ చేయాల్సి ఉంది. నివాసాల మధ్య విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ వాటికి వీధిలైట్లు లేవు. రహదారి పొడవునా బట్టర్‌ఫ్లై లైట్లు అమర్చాల్సిన అవసరం ఉంది. ఈ రకమైన అనేక సమస్యలతో లబ్ధిదారులు నిత్యం సతమతమవుతున్నారని నర్సింగ్‌రావు వివరించారు. ప్రజాప్రతినిధిగా, డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా హరీష్ రావు చొరవ తీసుకుని, సంబంధిత అధికారులతో మాట్లాడి డబుల్ బెడ్‌రూమ్ కాలనీవాసుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరడంజరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్ రూమ్ కమిటి అధ్యక్షులు దయాకర్, కమిటి సభ్యులు బిక్షపతి, శివ, రాజు, తాళ్ల నాగరాజు పాల్గొన్నారు.

## వెల్ది జడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**నేటి తరం –జనగాం జిల్లా**
రఘునాథపల్లి మండలం పరిధిలోని వెల్ది గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జెడ్పిహెచ్ఎస్ ఆవరణంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత వైభవంగా జరిగింది. దాదాపు 22 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత ఒకే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా ఒకే చోటికి చేరడంతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.
ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజులను, నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఈ సందర్భంగా విద్యార్థులు ఘనంగా సన్మానించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు.
"22 ఏళ్ల తర్వాత స్నేహితులందరినీ మళ్లీ కలుసుకోవడం,నాటి గురువుల చేతుల మీదుగా ఆశీర్వాదం పొందడం మర్చిపోలేని అనుభూతి" అని పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

**ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,**
ఎస్. వి.గంగాధర్, రావుల పద్మజ, పరమేశ్వర్,రాసమల్ల శారద,లింగంపల్లి సురేందర్, ముత్యాలు నరసయ్య, దర్శనాల రవి, చెరుకు సత్యనారాయణ,పన్నీరు సుధాకర్,నూనె ముంతల పరశురాములు,నకిరెడ్డి మాధవి,కొనుకటి స్వప్న, చెరుకు లక్ష్మి, నూనమంతుల సుహాసిని, సింగిరెడ్డి అశోక్,
పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అందరూ కలిసి విందు ఆరగించి,సెల్ఫీలు దిగుతూ రోజంతా ఎంతో ఉత్సాహంగా గడిపారు.పూర్వ విద్యార్థులు

# క్షీరసాగర్ గ్రామంలో ముమ్మరంగా 'కార్డన్ అండ్ సెర్చ్'..
# భారీగా మద్యం, బైకులు స్వాధీనం



**ములుగు మే 24, (నేటి తరం)**
ములుగు మండలం క్షీరసాగర్ గ్రామంలో శనివారం గజ్వేల్ ఏసీపీ నర్సింలు పర్యవేక్షణలో ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఆయేషా ఫాతిమా ఆధ్వర్యంలో భారీ పోలీస్ బలగాలతో 'కార్డన్ అండ్ సెర్చ్' నిర్వహించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే ధ్యేయంగా ఈ ఆపరేషన్ చేపట్టారు. ఈ తనిఖీల్లో ఏసీపీ గజ్వేల్, సీఐలు, 9 మంది ఎస్ఐలు మరియు 111 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం సిబ్బందిని 9 ప్రత్యేక బృందాలుగా విభజించి, గ్రామంలోని 180 ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఔటర్ కార్డన్, ఇన్నర్ కార్డన్, కటాఫ్ పార్టీలు మరియు హోల్డింగ్ టీమ్‌లను ప్రత్యేకంగా రంగంలోకి దించారు.తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న వివరాలు: సరైన పాత్రలు లేని 20 బైకులు, వాహనాలను, బెల్ట్ షాపుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 46 లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా గజ్వేల్ ఏసిపి నర్సింలు మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులకు, అనుమానాస్పదంగా ఉండే నూతన వ్యక్తులకు ఎలాంటి గుర్తింపు కార్డులు మరియు పూర్తి వివరాలు లేకుండా ఇళ్లను అద్దెకు ఇవ్వకూడదనీ సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి. గ్రామంలో ఎవరైనా ఇలాంటి అక్రమ రవాణాకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలనీ తెలియజేశారు. గ్రామంలో భద్రత పెంచడానికి, నేరాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ తమ వీధుల్లో, కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సరైన పత్రాలతో ప్రయాణించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. గ్రామంలో శాంతియుత వాతావరణానికి, నేర రహిత సమాజ స్థాపనకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## పోలీసింగ్‌లో విస్తృతంగా ఏఐ వినియోగం

హైదరాబాద్:
రాష్ట్ర పోలీసింగ్‌లో కృత్రిమమేధ(ఏఐ)ను విస్తృతంగా వినియోగించేందుకు డీజీపీ సీవీ ఆనంద్ కీలక నిర్ణయం తీసుకున్నారు. దీని కోసం తన కార్యాలయంలో సాంకేతిక నిపుణులతో 'టెక్‌టీం' ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శనివారం టెక్నికల్ సర్వీసెస్ డీజీ వి.వి.శ్రీనివాసరావుతో కలిసి శనివారం ఆయన సమీక్షించారు. సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. 'తెలంగాణ పోలీసు అధికారిక వెబ్‌సైట్, హాక్ఐ, సీసీటీఎన్ఎస్, హెచ్ఆర్ఎంఎస్ వంటి అన్ని సాంకేతిక ప్లాట్‌ఫాంలను డీజీపీ కార్యాలయం పరిధిలో ఒకే ఉమ్మడి వ్యవస్థ కింద తీసుకొస్తాం. పోలీసుశాఖలో చేపట్టే అన్ని ఏఐ సంబంధ ప్రాజెక్టులను పర్యవేక్షించేందుకు డీజీపీ కార్యాలయంలో 'మార్వెల్' తరహాలో ఒక ప్రత్యేక ఏఐ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. సీసీటీఎన్ఎస్, హెచ్ఆర్ఎంఎస్ వంటి వ్యవస్థలను అనుసంధానిస్తూ 'టీఎస్–కాప్స్' పేరిట ఒకే ఉమ్మడి మొబైల్ ప్లాట్‌ఫాంను రూపొందించాలి.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సరిపడా లారీలేవి.?







-రైతుల పట్ల దురుసుగా ప్రవర్తింస్తున్న ఐకేపీ
-ధాన్యం దిగుమతిలో రైస్ మిల్లర్ల నిర్లక్ష్యం
-రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్

(నేటి తరం), అందోలు

సంగారెడ్డి జిల్లా అందోలు మండలంలోని రామ్సన్పల్లి, అందోలు లో రైతు సంఘం ఆధ్వర్యంలో, ఆదివారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్, వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ. వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభమైన నాటి నుండి సరియైన లారీలు లేక రోజుల తరబడి వడ్లు తెచ్చుకొని కొనుగోలు కేంద్రాలలో రైతులు పడిగాపులుకాస్తు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రామ్సాన్పల్లి ఐకీపీ సెంటర్ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రానికి కొత్తపల్లి, తాండ, మూడు గ్రామాల రైతులు వడ్లను తెచ్చి అమ్ముతున్నారు. ఇప్పటివరకు కేవలం 12 లారీల ధాన్యం మాత్రమే కొన్నారని, ఇంకా సుమారు 15 లారీల పైన వరి ధాన్యం అమ్మకానికి రైతులు వద్ద ఉన్నా, అధికారులు లారిలను సరఫరాచేయకపోవడంతో. వడ్లు అన్ని బయట ఆరబెట్టి ఉండడంతో ఎండలో ఎండిపోతున్నాయని ఆయన అన్నారు. వర్షం వస్తే రైతులు వాటిని ఎక్కడ పెట్టాలి. కనుక తక్షణమే లారీలను సరఫరా చేసి రైతుల వద్ద ఉన్న వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు . అందోల్ లో నెల రోజుల నుండి వడ్ల కొనుగోలుప్రారంభమైనప్పటికీ కేవలం 7 మంది లేబర్ తోని ఐకెపి వారు వడ్ల కొనుగోలు చేస్తున్నారని లేబర్ లేక లారీలు రాక గత నాలుగు రోజుల నుండి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటివరకు ఈ యొక్క సెంటర్ ను ఏ ఒక్క అధికారి తనిఖీ చేయకపోవడంతో ఐకేపీ వారు ఇష్టానుసారంగా వడ్ల కొనుగోలు చేస్తున్నారని ఆయన అన్నారు. ఇదేమిటని అడిగిన రైతుల పట్ల దురుసుగా వివరిస్తూ ఇబ్బందుల పాలు చేస్తున్నారని అన్నారు. ఈ యొక్క సెంటర్లలో సంచులు లేక అత్యధిక రైతులు ఇబ్బందులు పడుతున్నారు ఈ యొక్క కేంద్రం కు మరిన్ని లారీలు సరఫరా చేసి రైతుల నుండి వడ్ల కొనుగోలు చేయాలని కోరారు. వర్షం వస్తే. రైతులకు తీవ్రనష్టంజరుగుతుందని తక్షణమే, అన్ని వడ్ల కొనుగోలు కేంద్రాలకు సరిపడా లారీలనుసమకూర్చాలనిఆయనప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు చేసిన రైతులకు వెంటనే డబ్బులుచెల్లించాలని రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద మంచినీటి నీటి సౌకర్యం కల్పించి వర్షం వస్తే దాన్యం తడవకుండా తగిన ఏర్పాట్లు చేయాలని రాత్రి వేళల్లో వసతి సౌకర్యం కల్పించాలని ఆయన అన్నారు. రైస్ మిల్లర్లు ధాన్యం దించుకోవడంలో నిర్లక్ష్యం కారణంగా లారీలు అక్కడే నిలిచిపోవడంతో కొనుగోలు కేంద్రాలకు రెండు మూడు రోజులకు ఒకసారి వస్తున్నాయి. ఇలాంటి నిర్లక్ష్యం చేస్తున్న రైస్ మిల్లర్ పై చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో. అందోల్ మండల రైతు సంఘం నాయకులు ప్రభాకర్, నరేందర్ గౌడ్ ,రైతులు సాయిలు, సంజీవులు, యాదయ్య, రాములు, సుధాకర్, శ్రీనివాస్, నర్సింలు, రాములు, ఊశయ్య తదితరులు పాల్గొన్నారు.

# "ఆపదలో అండగా నిలిచిన అజయ్ యాదవ్.. బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం"



(నేటి తరం) ప్రతినిధి ఇల్లందకుంట మే 24

ఇల్లందకుంట మండలం సీతంపేట గ్రామానికి చెందిన యువకుడు గుండ్ల హరీష్ తల్లిగారు మృతి చెందడం గ్రామంలో విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటన కుటుంబ సభ్యులను తీవ్ర మనోవేదనకు గురిచేయగా, వారి బాధలో భాగస్వామ్యం అవుతూ పలువురు గ్రామస్తులు సానుభూతి వ్యక్తం చేశారు.

ఈ విషయం గ్రామ సర్పంచ్ బక్కతట్ల లక్ష్మీ రవీందర్ కుమారుడు అజయ్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపద సమయంలో వెంటనే స్పందించి కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ, కష్టసమయంలో ఒక కుటుంబానికి చేయూతనివ్వడం గొప్ప విషయం అని, సమాజంలో ఇలాంటి సహృదయత మరింత పెరగాలని ఆకాంక్షించారు. బాధలో ఉన్న కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారని కొనియాడారు.

గుండ్ల హరీష్ కుటుంబానికి మానసిక ధైర్యాన్ని అందిస్తూ గ్రామ పెద్దలు, యువకులు పరామర్శించారు. కుటుంబ సభ్యులు కూడా తమకు అండగా నిలిచిన అజయ్ యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీరయ్య, చిన్న గట్టయ్య, పెద్ద గట్టయ్య, ఎల్లయ్య, అశోక్, కుమార్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

# టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా.. ఇల్లందకుంట దేవాలయంలో ప్రత్యేక పూజలు

(నేటి తరం) ప్రతినిధి ఇల్లందకుంట మే 24

ఇల్లందకుంట మండల కేంద్రంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా జరిపారు.





ఈ సందర్భంగా పెద్ది కుమార్ మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవే లక్ష్యంగా నిరంతరం పార్టీ బలోపేతం, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. యువతకు ఆదర్శంగా నిలుస్తూ పార్టీ కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగే నాయకత్వం ఆయన ప్రత్యేకత అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, కార్యకర్తలకు ప్రోత్సాహం అందిస్తూ సంస్థాగత బలపాటుకు కృషి చేస్తున్నారని వివరించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, బీసీల సాధికారత, సామాజిక న్యాయం సాధనలో ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.

అలాగే ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజా సేవలో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని నాయకులు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్ది శివకుమార్, కాంగ్రెస్ నాయకులు కనుమల్ల సంపత్, ఎక్కిటి సంజీవరెడ్డి, సర్పంచులు కోరు కండ్ల శ్రీనివాస్, ఆరెల్లి రమేష్, బైరెడ్డి కొండల్ రెడ్డి, జిల్లెల్ల సందీప్ రెడ్డి, మద్రి వీరారెడ్డి, సింగిరెడ్డి గోపాల్ రెడ్డి, గైకోటి రాజు, దంసాని తిరుపతి, భోగం పృథ్వీరాజ్, ఆరే రమేష్ రెడ్డి, గూడపు ఓదెలు, మారపల్లి వేణు, కొత్తూరు రాజేందర్, జక్కు కుమార్, మారేపల్లి వంశీ, జలంధర్ రెడ్డి, ధార నరేష్, బోయిన్ విష్ణు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జీనియస్ ర్యాంకింగ్ చదరంగం పోటీలకు విశేష స్పందన.





(నేటి తరం) కరీంనగర్ మే 24

కరీంనగర్ శ్రీ చైతన్య యూత్ క్లబ్ భగత్ నగర్ లో ఆదివారం నిర్వహించిన జీనియస్ ర్యాంకింగ్ చెస్ పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచినుంచి 125 మంది చదరంగం క్రీడాకారులు తమ మేధాశక్తిని నిరూపించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నూరు రూరల్ సిఐ ఆర్ కృష్ణ ,జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య పాల్గొని మొదటి ఎత్తు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణ మాట్లాడుతూ పిల్లలకు చదరంగంతో మేధాశక్తితో పాటు ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య మాట్లాడుతూ పిల్లల ప్రతిభను వెలికి తీయడానికే ర్యాంకింగ్ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నామని ఈ టోర్నమెంట్ లక్ష్మీనారాయణ సోలార్ ఎంటర్ప్రైజర్ వారి సహకారంతో నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్, లక్ష్మీనారాయణ సోలార్ ఎంటర్ప్రైజెస్ మేనేజర్ శ్రీనివాస్ ఎండి కుమారస్వామి , చైతన్య యూత్ క్లబ్ సభ్యులు పండుగ నాగరాజు,కరీంనగర్ జిల్లా డెమొక్రటిక్ డెవలప్మెంట్ కార్యదర్శులు కంకటి సృజన్ కుమార్, తాటిపల్లి సతీష్ బాబు, రాకేష్, చీఫ్ ఆర్బిటర్ తరుణ్, అరుణ్, ఆర్బిటర్లు అభిరామ్, నితిన్, రేవిక్, స్వాతి, ప్రభుదేవా, వరుణ్, విశాల్ , అజయ్ క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వెల్దుర్తి మండల బిజెపి పార్టీ కన్వీనర్ గా ఎన్నికైన హనుమాద్రి బాల గౌడ్ ని సన్మానించినరాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామ్మోహన్ గౌడ్

- బిజెపి పార్టీని మండల వ్యాప్తంగానే కాకుండా జిల్లా వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేతుల నుండి అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేని ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వం చేసినటువంటి పనులను తాము చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆరోపణ చేసిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామ్మోహన్ గౌడ్
- నన్ను నమ్మి నాకు వెల్దుర్తి మండలం కన్వీనర్గా పదవి బాధ్యతలు అప్పజెప్పిన బిజెపి పార్టీకి తగిన న్యాయం చేస్తాను హనుమాద్రి బాలా గౌడ్

(నేటి తరం) వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి మే 24

మెదక్ జిల్లా బిజెపి పార్టీ మండల కన్వీనర్ గా ఎన్నికైన బాలా గౌడ్ ని శాల్వోతో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామ్మోహన్ గౌడ్ సత్కరించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాను బిజెపి పార్టీలో చేరడం ఎంతో సంతోషకరమని రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయం అని రామ్మోహన్ గౌడ్ తెలియజేశారు వెల్దుర్తి మండల బిజెపి పార్టీ నుండి అతని నియమించడంతో వెల్దుర్తి మండల లోని బిజెపి పార్టీ మరింత బలోపేతనం పెరిగే అవకాశం ఎంతో ఉన్నదని తాను గతంలో కూడా బిజెపి పార్టీ నుండి వెల్దుర్తి మండల బిజెపి మండల అధ్యక్షులుగా వ్యవహరించారు మునుముందు కూడా రానున్నరోజుల్లో తాను రాజకీయపరంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నానని వారు తెలియజేశారు తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి పార్టీ విజయకేతనం ఎగరవేరేమని వారు తెలియజేశారు భారత దేశ ప్రజలు మోడీ ప్రభుత్వాన్ని ప్రతి రాష్ట్రంలో పరిపాలన తాగాలని విధంగానే ప్రతి ఒక్క హిందువు బిజెపి పార్టీకి ఓటు వేయడం జరుగుతుందని చెప్పటానికి నిదర్శనం మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని బిజెపి పార్టీ సంబంధించిన సర్పంచ్ అభ్యర్థిగా ఆదర్శ్ గెలవడం అందరికీ ఆదర్శం అని వారు తెలిపారు మునుముందు రాజకీయం మారుతుంది రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో బిజెపి పార్టీ విజయకేతనం కచ్చితంగా విజయం సాధించే విధంగానే బిజెపి పార్ట ప్రతి ఒక్క నాయకులు కార్యకర్తలు సమిష్టింగంగా కృషిచేసి పార్టీ పరువు ప్రశిష్ట ల కోసం అందరం స్పష్టంగా కృషి చేస్తే తెలంగాణ రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి పార్టీ విజయవంతం ఎగరబడిన కాకుండా బిజెపి పార్టీకి సంబంధించిన ముఖ్యమంత్రి పదవి బాధ్యతలను చేపట్టడం ఖాయమని వారు తెలియజేశారు నేడు తెలంగాణ రాష్ట్ర రైతులు పండించినటువంటి పంటను సరియైన సమయాలలో వారు పండించే పంటను తీసుకొకపోవడం తెలంగాణ రాష్ట్ర రైతుల బాధలను పట్టించుకోని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అని రైతు లేని రాజ్యం లేదనేది భారతీయ జనతా పార్టీ వేయమని రైతులకు కేంద్ర ప్రభుత్వం నుండి ఎన్నో సదుపాయాలు కల్పిస్తే మేమే చేస్తున్నాము అని గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం పరిపాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకోవడమే తప్ప వారు చేసింది ఏమీ లేదు అని నేడు రైతు చేతికి వచ్చినట్టు పంటను వారు కష్టార్జితంతో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లి ఆరబెట్టిన మరినీ తూకం వేసిన వారి ధాన్యాన్ని లారీల ద్వారా తీసుకువెళ్లని పరిస్థితులు వచ్చాయి అంటే రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమేనని వారు ఎత్తిన చేశారు ఇకనైనా రైతుల బాధ కోసను అర్థం చేసుకొని రైతులకు న్యాయం చేసే విధంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించాలని వారు మండిపడ్డారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిటీ నెంబర్ అంగడిపేట శ్రీనివాస్ గౌడ్ వెల్దుర్తి గ్రామ సర్పంచ్ ఆదర్శ్ పాల్గొన్నారు

000

# అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నిఖిల్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే నాగరాజు

(నేటి తరం) చీఫ్ బ్యూరో, మే 24

హనుమకొండ జిల్లా హసన్పర్తి మండలంలోని మల్లారెడ్డిపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మేడిపల్లి మదన్ గౌడ్ బంధువు తోడేటి నిఖిల్ ఈతకు వెళ్లి అనారోగ్యానికి గురై హనుమకొండలోని శ్రీనివాస పినాకిల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆస్పత్రికి వెళ్లి నిఖిల్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా నిఖిల్ ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని వారికి మనోధైర్యం కల్పించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి నిఖిల్‌కు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి, భగత్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ హరి ప్రసాద్ కు బెస్ట్ ఆస్ట్రాలజర్ 26 అవార్డు .

(నేటి తరం) కరీంనగర్ మే 24

ప్రముఖ జ్యోతిర్వస్తు పండితులు బ్రహ్మశ్రీ డాక్టర్ బరిబద్దల హరిప్రసాద్ బెస్ట్ ఆస్ట్రాలజర్ 26 అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో జి సి ఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైద్రాబాద్ , రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు కార్యక్రమము లో, అంతర్జాతీయ సర్టిఫైడ్ ఆస్ట్రాలజర్ డాక్టర్ బరిబద్దల హరిప్రసాద్ ఈ అవార్డు అందుకున్నారు.








ఈ క్రమంలో ముఖ్యఅతిథులుగా హాజరైన దైవజ్ఞ శర్మ గారు, ఓయూ పోలీస్ ఏసిపి జగన్ , తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ , యాక్టర్ రామ్ శెట్టి దొరస్వామి, హైకోర్టు న్యాయవాది కేఎల్ఎన్ ప్రసాద్ ల చేతుల మీదుగా ఈ అవార్డు తీసుకున్నారు.

# నకిలీ వాట్సాప్ నంబర్‌పై మల్కాజిగిరి పోలీసుల హెచ్చరిక

(నేటి తరం) హైదరాబాద్, మే 24




మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ప్రజలకు కీలక హెచ్చరిక జారీ చేసింది. పోలీస్ కమిషనర్ సుమతి ఐపీఎస్ పేరును దుర్వినియోగం చేస్తూ 82397 14091 నంబర్‌తో నకిలీ వాట్సాప్ అకౌంట్ సృష్టించి మోసాలకు పాల్పడే ప్రయత్నాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నకిలీ అకౌంట్ ద్వారా ప్రజలను నమ్మించి డబ్బులు అడగడం, వ్యక్తిగత సమాచారం సేకరించడం వంటి సైబర్ మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. కమిషనర్ పేరుతో వచ్చే ఎలాంటి మెసేజ్‌లు, కాల్స్ లేదా ఆర్థిక లావాదేవీలకు స్పందించవద్దని స్పష్టం చేశారు. అనుమానాస్పద వాట్సాప్ సందేశాలు, ఫోన్ కాల్స్ లేదా సైబర్ మోసాలకు సంబంధించిన సమాచారం ఎదురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయాలని, లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని మల్కాజిగిరి పోలీసులు ప్రజలను కోరారు.

# వరి కొనుగోలు పక్రియను వేగవంతం చేయాలి...

- రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పిడిశెట్టి రాజు



(నేటి తరం) కోహెడ, మే 24



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంటల కొనుగోళ్లు వేగవంతం చేయాలనీ రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి , కంటెస్టెడ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మార్కెట్ యార్డ్ ను ఆదివారం సందర్శించి అనంతరం వారు మాట్లాడుతూ.. కోహెడ మార్కెట్ యార్డ్ కి మండలంలోని 27 గ్రామాల నుండి రైతులు వరి దాన్యాన్ని తమ ట్రాక్టర్లలో లోడ్ చేసుకొని, తూకంతో మార్కెట్ యార్డ్ కి తీసుకుని రావడంతో.... అక్కడ డంపింగ్ చెయ్యాడానికి హమాలీలు పద్దెనమిది మంది మాత్రమే ఉన్నారు. కాబట్టి వందల సంఖ్యలో లోడ్ ఉన్నా ట్రాక్టర్లు చాలా సేపు వేచి ఉండటం వల్ల చాలా ఇబ్బంది కలుగుతుంది. కావున హమాలీల సంఖ్య వంద మందిని నియమించి తొందరగా డంపింగ్ చేపట్టాలని ప్రభుత్వానికి, మార్కెట్ కమిటీ చైర్మన్, అధికారులకు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం నాయకులు చల్ల మల్లారెడ్డి, భూపాల్ రెడ్డి వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో కార్మికుడు మృతి

(నేటి తరం) వరంగల్ మే 24



వరంగల్ ఉర్సు ప్రాంతానికి చెందిన మైదం శ్రీను (55) వడదెబ్బకు గురై మృతి చెందారు.కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం,గత కొన్ని రోజులుగా తీవ్ర ఎండలు కొనసాగుతున్న నేపథ్యంలో శ్రీను రెండు రోజుల పాటు ఎండలో సెంట్రింగ్ పనులు చేశారు.దీంతో వేసవి తాపాన్ని తట్టుకోలేక అస్వస్థతకు గురయ్యారు.రాత్రి సమయంలో తన నివాసంలో ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.శ్రీను మృతితో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.స్థానికులు కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# ఓటర్ మ్యాపింగ్ శాతం పెంపుపై ప్రత్యేక క్యాంపెయిన్

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

(నేటి తరం) వరంగల్ మే 24



వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఎన్నికల ఓటర్ మ్యాపింగ్ శాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రత్యేక దృష్టి సారించారు.ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి శాతం పెంచేందుకు ఆదివారం ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహించారు.ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ మరియు ఖిలా వరంగల్ తహసీల్దార్ల ఆధ్వర్యంలో వివిధ పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శివనగర్, చింతల్ ప్రాంతాలను సందర్శించి ఓటర్ మ్యాపింగ్ పురోగతిని పరిశీలించారు. అనంతరం బూత్ లెవెల్ అధికారులు (బీఎల్వోలు),బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), తహసీల్దార్లతో సమావేశమై ఓటర్ మ్యాపింగ్ శాతాన్ని పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు.అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ,ఓటర్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి,జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి,వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్,ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# నేత్రదానం మహాదానం.. రావికంటి రాజయ్య నేత్రాలతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు

(నేటి తరం) ప్రతినిధి జమ్మికుంట మే 24

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్ నివాసి కీర్తిశేషులు రావికంటి రాజయ్య (80) మరణానంతరం చేసిన నేత్రదానం ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపింది. మానవత్వానికి ప్రతీకగా నిలిచిన ఈ సేవా కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది.

ఆదివారం ఉదయం వృద్ధాప్య కారణాలతో రావికంటి రాజయ్య మృతి చెందారు. అనంతరం గర్రెపల్లి వెంకటేశ్వర్లు అందించిన సమాచారం మేరకు సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి కుటుంబ సభ్యులకు నేత్రదానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. నేత్రదానం ద్వారా మరణించిన తర్వాత కూడా ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపవచ్చని వివరించారు.

కుటుంబ సభ్యులు సానుకూలంగా స్పందించి నేత్రదానానికి అంగీకరించడంతో సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి ఆధ్వర్యంలో, వరంగల్‌కు చెందిన ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ నరేందర్ సహకారంతో నేత్రాలను



సేకరించారు. అనంతరం వాటిని హైదరాబాద్‌లోని ఐ బ్యాంక్‌కు తరలించారు.

రావికంటి రాజయ్య నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు లభించే అవకాశం కలగడం పట్ల కుటుంబ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన కుమారులు, కోడళ్లు రావికంటి నీలకంఠం--శ్రీలత, వెంకటేశ్వర్లు--నీరజ మానవతా దృక్పథంతో తీసుకున్న నిర్ణయం పలువురి ప్రశంసలు అందుకుంది.

ఈ కార్యక్రమంలో సహకరించిన గర్రెపల్లి వెంకటేశ్వర్లు, చిటికేసి శివానందయ్య, ముత్యాల జగదీశ్వర్, చిదురాల శ్రీనివాస్, వంగల రమేష్‌లకు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ నాయకులు



మాట్లాడుతూ, "నేత్రదానం మహాదానం. మరణానంతరం కూడా మనిషి మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపగలడు. సమాజంలో ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకుని ముందుకు రావాలి" అని పిలుపునిచ్చారు.

# "మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం.. ప్రమాదంలో మృతి చెందిన సలీం కుటుంబానికి రూ.1,00,500 ఆర్థిక సహాయం"

(నేటి తరం) ప్రతినిధి జమ్మికుంట మే 24

రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందిన ఎండీ సలీం కుటుంబానికి అండగా నిలుస్తూ 1996--97 సంవత్సరానికి చెందిన గౌతమి హైస్కూల్ 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం మానవత్వాన్ని చాటుకున్నారు. సలీం కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో రూ. 1,00,500 సహాయాన్ని అందించారు.

కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సేకరించిన మొత్తాన్ని నేరుగా అందజేయకుండా, సలీం కుమార్తె పేరుపై జమ్మికుంట పోస్టాఫీస్‌లో ఒక సంవత్సరం కాలపరిమితితో డిపాజిట్ చేశారు. అనంతరం సంబంధిత బాండ్ పత్రాలు, అకౌంట్ బుక్‌ను కుటుంబ



సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడిన సభ్యులు, ఆపద సమయంలో ఒకరికొకరు అండగా నిలబడటం సమాజ బాధ్యత అని తెలిపారు. చిన్న సహాయం కూడా కష్టాల్లో ఉన్న కుటుంబానికి పెద్ద భరోసాగా నిలుస్తుందని పేర్కొన్నారు. సలీం కుటుంబానికి భవిష్యత్తులో కూడా అవసరమైన సహకారం అందించేందుకు తమవంతు సహాయం కొనసాగిస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమం ద్వారా స్నేహబంధం, సామాజిక బాధ్యత, మానవతా విలువలను మరోసారి చాటిచెప్పినట్లు స్థానికులు అభిప్రాయపడ్డారు. కష్ట సమయంలో కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు, స్థానిక ప్రజలు, గ్రామస్తులు 1996--97 గౌతమి హైస్కూల్ 10వ తరగతి బ్యాచ్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. సమాజానికి ఆదర్శంగా నిలిచే కార్యక్రమాన్ని చేపట్టారని ప్రశంసించారు.

# ఘనంగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ జన్మదిన వేడుకలు

(నేటి తరం) ప్రతినిధి వీణవంక మే 24

వీణవంక మండల కేంద్రంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ 62వ జన్మదిన వేడుకలు మండల పార్టీ అధ్యక్షులు ఎక్కటి రఘపాల్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది అనంతరం కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా రఘపాల్ రెడ్డి, ఎండీ సాహెబ్ హుస్సేన్, గంగాడి తిరుపతి రెడ్డి లు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ లో కార్యకర్త స్థాయి నుండి నేడు టీపీసీసీ అధ్యక్షులు వరకు ఎదిగిన

మహేష్ కుమార్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని



అన్నారు.

మహేష్ కుమార్ గారు ఎన్. స్. యు. ఐ రాష్ట్ర అధ్యక్ష పదవి బాధ్యతలు చేపట్టి విద్యార్థి లోకానికి సేవలు అందించారని, అలాగే కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉన్న నాయకుడు మహేష్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాని

ఈ సందర్భంగా వీణవంక మండల ప్రజల పక్షాన జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎక్కటి రఘపాల్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్, నాయకులు గంగాడి తిరుపతి రెడ్డి,సర్పంచ్ అందె శ్రీమతి - కుమార్,ఉప సర్పంచ్ మడ్డి మహేష్,జిల్లా కార్యదర్శిలు వావిలాల సత్యనారాయణ, కంకణాల జగదీశ్వర్ రెడ్డి,మాజీ సర్పంచ్ లు మేకల ఎల్లారెడ్డి,పానుగంటి మధుకర్, పంజాల సతీష్,చిన్నాల ఐలయ్య, కర్ర తిరుపతి రెడ్డి,డైరెక్టర్ ఎండీ రషీద్, నాయకులు జున్నుతుల మధుకర్ రెడ్డి,ఉపేందర్ రెడ్డి,బావు రాకేష్, జున్నుతుల మల్లా రెడ్డి, గాజుల శ్రీనివాస్, సమ్మిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు బండారి లక్ష్మణ, ఉయ్యాల నాగ రాజు,రాపర్తి రవి ,తదితరులు పాల్గొన్నారు.

# ఉమంగ్ 2026 లో ఎస్ఎస్సీ టాపర్లకు ఘన సన్మానం




- విద్యార్థుల భవిష్యత్తుకు వృత్తి మార్గదర్శక కార్యక్రమం దిశానిర్దేశం

(నేటి తరం) వరంగల్ మే 23

వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్‌లో ఉన్న ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో ఉమంగ్ 2026 పేరుతో నిర్వహించిన వృత్తి మార్గదర్శకత్వం మరియు ఎస్ఎస్సీ స్కూల్ టాపర్స్ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది.విద్యార్థులు,తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమాన్ని ప్రముఖ జర్నలిస్ట్ ఇస్మాయిల్ జబీహ్ (సియాసత్ డైలీ,సియాసత్ టీవీ) సమన్వయం చేశారు.ఎస్ఎస్సీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడం,వారి ప్రతిభను గుర్తించడం,భవిష్యత్తుకు సరైన వృత్తి మార్గదర్శకత్వం అందించడం కార్యక్రమ




ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు.సియాసత్ డైలీ మరియు సియాసత్ టీవీ న్యూస్ ఎడిటర్ అమీర్ అలీ ఖాన్ ముఖ్య అతిథిగా పాల్గొని,40 మంది ఎస్ఎస్సీ టాపర్లకు అవార్డులు,ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు.ఈ సందర్భంగా విద్యార్థులు,వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.ముఖ్య అతిథి అమీర్ అలీ ఖాన్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పరీక్షల్లో విజయంతో ఆగిపోకుండా జీవితానికి స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు.ఆధునిక విద్య,నైపుణ్యాలు,సానుకూల ఆలోచనలతో యువత తమ భవిష్యత్తును నిర్మించుకుని సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.గౌరవ అతిథి డాక్టర్ అనీస్ అహ్మద్ సిద్ధిఖీ మాట్లాడుతూ,నేటి విద్యార్థులే రేపటి భారత భవిష్యత్తుకు శిల్పులని పేర్కొన్నారు.కష్టపడి,నిజాయితీగా,అంకితభావంతో చదివితే విద్యార్థులు తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,సమాజానికి గౌరవం తీసుకురాగలరని అన్నారు.మరో గౌరవ అతిథి ముహమ్మద్ మసూమ్ అలీ మాట్లాడుతూ,విద్య ప్రతి వ్యక్తి యొక్క ప్రాథమిక హక్కు అని అన్నారు.విలాసాలకు దూరంగా ఉన్నా విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.సాదాసీదా జీవితం గడిపినా పరవాలేదు,కానీ విద్య విషయంలో రాజీ పడకూడదు అని పేర్కొన్నారు.ఈ




కార్యక్రమంలో మీర్జా కమర్ అలీ బేగ్,అబ్దుల్ ఖయ్యూమ్,ముహమ్మద్ ఇక్బాల్,ముహమ్మద్ నసీరుద్దీన్,సయ్యద్ సుభానుద్దీన్,ముహమ్మద్ మహమూద్,ముహమ్మద్ రిజ్వాన్,మీర్జా అమీర్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.ఇదే సందర్భంగా తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీయూడబ్ల్యూజేయూ)వరంగల్ జిల్లా కన్వీనర్ ఎం.ఫతేవుల్లా బేగ్ రియాజ్‌ను అమీర్ అలీ ఖాన్ శాలువాతో సన్మానించారు.ఉర్దూ జర్నలిస్టుల సమస్యలు,హక్కుల పరిరక్షణకు సంబంధించి ఆయన ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.ఉర్దూ పాత్రికేయులకు ప్రభుత్వ స్థాయిలో తగిన గుర్తింపు,సౌకర్యాలు కల్పించాలని అందులో కోరారు.కార్యక్రమం ముగింపులో నిర్వాహకులు అతిథులు,విద్యార్థులు,తల్లిదండ్రులు,పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనడంతో కార్యక్రమం విజయవంతంగా,చిరస్మరణీయశీగా నిలిచింది.విద్యా మరియు వృత్తి మార్గదర్శక కార్యక్రమాలు నేటి సమాజానికి అత్యవసరమని పలువురు అభిప్రాయపడ్డారు.

## నాగార్జున ఎమోషనల్: డిస్ట్రిబ్యూటర్ ‘నెల్లూరు’ హరి కన్నుమూత.. అక్కినేని ఫ్యామిలీ బలమైన అండను కోల్పోయింది



తెలుగు సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ (పంపిణీదారుడు), ఎగ్జిబిటర్, నిర్మాత ‘నెల్లూరు’ హరి అలియాస్ గుజ్జలపూడి హరికుమార్ (46) కన్నుమూశారు. ఆదివారం (మే 24, 2026) ఉదయం గుండెపోటుతో ఆయన తుదిశ్వాస విడిచారు. కేవలం 46 ఏళ్ల వయసులోనే హఠాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందడం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. దాదాపు రెండు దశాబ్దాలుగా పంపిణీ రంగంలో కీలక పాత్ర పోషించిన హరి ఆకస్మిక మరణం సినీ వర్గాలను సైతం దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

హరి పిక్చర్స్ ద్వారా ఎన్నో హిట్ చిత్రాలను హరికుమార్ పంపిణీ చేశారు. 2025లో ‘సంక్రాంతికి వస్తున్నాం’ సహా పలు సక్సెస్ ఫుల్ సినిమాల వెనుక కీలక పాత్ర పోషించారు. 2006లో రామ్ నటించిన ‘దేవదాస్’ సినిమాను తమిళనాడులో విడుదల చేసి వరుస సినిమాలను పంపిణీ చేసి సక్సెస్ అయ్యాడు. ఈ క్రమంలోనే హరి గత 20 ఏళ్లలో వందలాది చిత్రాలను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. టాలీవుడ్‌లోని అగ్ర నిర్మాణ సంస్థలైన అన్నపూర్ణ స్టూడియోస్, శ్రేష్ఠ మూవీస్, వైజయంతీ మూవీస్, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ల నుంచి వచ్చిన పలు భారీ చిత్రాలను నెల్లూరు ప్రాంతంలో పంపిణీ చేస్తూ హరి ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ఈ క్రమంలోనే హరి మృతిపై సినీ స్టార్స్, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

హరి మరణవార్త వినగానే అక్కినేని నాగార్జున తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆయనతో తనకు ఉన్న 25 ఏళ్ల సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ పోస్ట్ పెట్టారు.

“గుజ్జలపూడి హరికుమార్ మరణ వార్త నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి, విషాదానికి గురిచేసింది. మా పరిచయం 25 ఏళ్లకు పైగా ఉంది. అక్కినేని కుటుంబానికి ఆయన ఎప్పుడూ ఓ అండగా నిలిచారు. మా జీవితాల్లో ఆయన స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. తెలుగు సినీ పరిశ్రమ ఒక గొప్ప డిస్ట్రిబ్యూటర్‌ను, అద్భుతమైన మనసున్న వ్యక్తిని కోల్పోయింది. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను” అంటూ నాగార్జున సంతాపం వ్యక్తం

## అది ఏమాత్రం మంచిది కాదు..
## ఎడ్యుకేషన్ సిస్టమ్‌పై పూరి మ్యూజింగ్స్



మార్కులకే ప్రాధాన్యమిస్తూ విద్యార్థులను కాంపిటేషన్ మోడ్‌లో ఉంచడం ఏమాత్రం మంచిది కాదని ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ పేర్కొన్నారు. పాఠశాల, కళాశాలల్లో సబ్జెక్టుల కన్నా ముందు జీవితం గురించి నేర్పాలని అభిప్రాయపడ్డారు. ‘ఫ్యూచర్ ఎడ్యుకేషన్’ పేరిట ‘పూరి మ్యూజింగ్స్’లో విద్యావ్యవస్థపై మాట్లాడారు.

“నేటి మోడ్రన్ స్కూళ్లు పిల్లలకు అపారమైన జ్ఞానాన్ని అందిస్తున్నాయి. అయితే ఆ నాలెడ్జ్ విద్యార్థులను బలమైన వ్యక్తులుగా (మానసికంగా) తయారు చేసేందుకు ఉపయోగపడదు. ఇంటి పనులు ఎలా చేసుకోవాలన్నది ఎల్‌కేజీ నుంచే నేర్పాలి. శుభ్రత గురించి చెప్పాలి. ఐదేళ్లకే సమయపాలన, నిజాయతీ అంటే ఏంటో వివరించాలి. ప్రతి విద్యార్థికీ క్రమశిక్షణను నూరిపోయాలి. కుకింగ్ క్లాసెస్ కూడా ఉండాలి. వ్యాయామం, ఆటలు తప్పనిసరి చేయాలి. డిజిటల్ డిసిప్లిన్ గురించి చెప్పాలి.

ఇప్పటి స్కూళ్లన్నీ పరీక్షలు, మార్కులు, కంఠస్తం చేయడంపై దృష్టి పెడుతున్నాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ కన్నా ముందు సెల్ఫ్ కంట్రోల్, టైమ్ మేనేజ్‌మెంట్, ఎమోషనల్ బ్యాలెన్స్ లాంటి వాటిపై పాఠాలుండాలి. ఇవే వారికి జీవితంలో ఉపయోగపడతాయి. వారానికోసారి విద్యార్థులతో మెడిటేషన్ చేయించాలి. వయసుపెరిగేకొద్దీ.. ఒత్తిడిని ఎలా అధిగమించాలి? కోపాన్ని ఎలా కంట్రోల్ చేయాలి? అన్నవి చెప్పాలి. కమ్యూనికేషన్ ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. కనీసం మూడు భాషలు మాట్లాడేలా చూడాలి. మెంటల్ హెల్త్‌పై అవగాహన కలిగించేలా ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలి. అన్నింటికన్నా ముఖ్యంగా ప్రకృతిని ఎలా కాపాడుకోవాలన్నది చెప్పాలి. వీటి తర్వాతే మిగిలిన సబ్జెక్టులుండాలి. జీవితంలో కష్టం ఎదురైతే పాఠశాలలో చెప్పిన మోటివేషన్ క్లాస్ గుర్తురావాలి. అందుకే పిల్లల్ని మోటివేట్ చేసే టీచర్లు కావాలి. ఈరోజుల్లో ఏ డిగ్రీ అయినా అది బేసిక్ ఎడ్యుకేషన్ మాత్రమే. దానితో జీవితం మారిపోదు. దానికోసం చిన్నప్పటి నుంచీ పుస్తకాలను భుజాన మోయించాల్సిన అవసరం లేదు. మార్కుల కోసం వారిని కాంపిటిషన్ మోడ్‌లో పెట్టడం మంచిది కాదు. దీని వల్ల చిన్నప్పుడే ఆందోళనకు లోనవుతున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం.. మన దేశంలో ఏటా 13,000 నుంచి 15,000 మంది విద్యార్థులు సూసైడ్ చేసుకుంటున్నారు. అకడమిక్ ఒత్తిళ్లు, ఫెయిల్యూర్‌కి భయపడటం, కుటుంబం పెట్టుకున్న అంచనాలు, డిప్రెషన్‌లాంటివి ఇందుకు కారణం. ఇన్ని వేల మంది ఆత్మహత్య చేసుకుంటున్నారంటే వారి మానసిక పరిస్థితిని అర్థం చేసుకోండి.

మన ఎడ్యుకేషన్ సిస్టమ్ మారాలి. పిల్లలు పర్సనల్‌గా స్ట్రాంగ్ కావాలి. పోలీసు అధికారులను స్కూళ్లు, కాలేజీలకు ఆహ్వానించి విద్యార్థులకు సివిక్ సెన్స్ నేర్పించాలి. చదువుకన్నా సంస్కారం ముఖ్యం. అందుకే సంస్కారం, మనోస్థైర్యం నేర్పే ఎడ్యుకేషన్ రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా” అని అన్నారు.



## ఈవెంట్‌లో తడబడిన రామ్‌చరణ్.. క్రికెటర్‌కు క్షమాపణలు

ప్రముఖ నటుడు రామ్‌చరణ్ హీరోగా తెరకెక్కిన ‘పెద్ది’ మూవీ ఈవెంట్ లో శనివారం సాయంత్రం భోపాల్‌లో ఘనంగా జరిగిన సంగతి తెలిసిందే. అయితే, వేదికపై క్రికెటర్ల గురించి ఒక్క మాటలో చెప్పాలంటూ హోస్ట్ ర్యాపిడ్‌ఫైర్ నిర్వహించారు. ఈ క్రమంలో చరణ్ కాస్త తడబడ్డారు. జస్‌ప్రీత్ బుమ్రా కు తాను అభిమానిని అని చెప్పిన చరణ్.. ఆయన్ను ఫుట్‌బాల్ ప్లేయర్‌గా పేర్కొన్నారు. సంబంధిత క్లిప్పింగ్ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీనిపై స్పందిస్తూ రామ్‌చరణ్ క్షమాపణలు చెప్పారు.“నేను కొన్నిసార్లు పేర్లను మర్చిపోతుంటా. జనసందోహం, అక్కడ హంగామా మధ్య అనుకోకుండా పొరపాటు జరిగింది. జస్‌ప్రీత్ బుమ్రాకు క్షమాపణలు. ఆయన్ను నేను గౌరవిస్తాను. ఆయన ఆటకు నేను పెద్ద ఫ్యాన్. బ్యాటర్లు వెనకడుగు వేసేలా మీ నిలకడైన ఆటతీరు భారతీయులంతా గర్వపడేలా చేస్తోంది” అని కొనియాడారు.ఈవెంట్ నిర్వహించిన ప్రాంతం విషయంలోనూ చరణ్ పొరపడ్డారు. భోపాల్‌కు బదులు బిహార్ అని ప్రస్తావించారు. అయితే, తన పొరపాటును

## పెద్ది డ్యాన్స్ ట్రై చేద్దామా.. ఇన్‌స్టా స్టోరీస్‌లో ‘పెద్ది’ పోస్టర్లతో ఆసీస్ క్రికెటర్ రచ్చ రచ్చ!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ‘పుష్ప’ సినిమాలోని ‘తగ్గేదే లే’ డైలాగులు, సాంగ్స్‌కు రీల్స్ చేసి సోషల్ మీడియాలో రచ్చ లేపిన ఆస్ట్రేలియా డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆ రీల్స్‌తో తెలుగు ఆడియన్స్‌కు విపరీతంగా దగ్గరైన వార్నర్.. ఆ తర్వాత యంగ్ హీరో నితిన్ నటించిన ‘రాబిన్ హుడ్’ సినిమాలో ఒక క్రేజీ క్యామియో (ప్రత్యేక పాత్ర) రోల్ ప్లే చేసి వెండితెరపై కూడా అలరించాడు. ఇక రీల్స్‌తో మొదలైన వార్నర్ టాలీవుడ్ ప్రయాణం.. ఇప్పుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ రాబోయే మోస్ట్ ఎవైటెడ్ మూవీ ‘పెద్ది’ కి అఫీషియల్ సపోర్ట్ ఇచ్చాడు.

రామ్ చరణ్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ లీడ్ రోల్స్ లో నటిస్తున్న ‘పెద్ది’ సినిమా ప్రమోషనల్ కంటెంట్, అఫీషియల్ పోస్టర్లను డేవిడ్ వార్నర్ తన అధికారిక సోషల్ మీడియా అకౌంట్లలో షేర్ చేశాడు. ముఖ్యంగా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్లను పోస్ట్ చేస్తూ.. పెద్ది డ్యాన్స్ ట్రై చేద్దామా అని పోల్ పెట్టగా సుమారు 94 శాతం మంది్‌వం అని సమాధానం ఇచ్చారు. దీంతో మెగా ఫ్యాన్స్ వార్నర్ చేసిన పోస్టులను సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ చేస్తున్నారు.‘ఆర్‌ఆర్‌ఆర్’ తర్వాత రామ్ చరణ్ నటిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదటిసారి చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తుండటం విశేషం. గతంలో ‘పుష్ప’, ‘ఆర్‌ఆర్‌ఆర్’ సినిమాలపై రీల్స్ చేసిన వార్నర్, ఇప్పుడు ‘పెద్ది’ సినిమాకు ఒక ప్రమోటర్ లాగా సపోర్ట్ ఇవ్వడం ఈ

## ‘దృశ్యం 3’ కలెక్షన్ల సునామీ.. 3 రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లోకి.. తగ్గేదే లేదంటూ భారీ వసూళ్లు

మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ నటించిన ‘దృశ్యం 3’ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ చిత్రం కేవలం మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. మే21న విడుదలైనప్పటి నుంచి ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ అనేక ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ షోలతో రన్ అవుతోంది. శనివారంతో మూడు రోజులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లతో మోహన్ లాల్ కెరియర్లో మరో బ్లాక్‌బస్టర్?గా నిలిచింది.

ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, క్రైమ్ థ్రిల్లర్ ‘దృశ్యం 3’ శనివారం (మే23న) ఒక్కరోజే రూ.13.70 కోట్ల నెట్ కలెక్షన్లు రాబట్టింది. ఇందులో మలయాళ వెర్షన్ నుంచి అత్యధికంగా రూ.11.65 కోట్లు రాగా, తెలుగు వెర్షన్ రూ.1.2 కోట్లు, తమిళం రూ.60 లక్షలు, కన్నడ వెర్షన్ రూ.25



లక్షలు వసూలు చేశాయి. దీంతో ఇండియాలో మూడు రోజుల్లో మొత్తం గ్రాస్ కలెక్షన్లు రూ.47.17 కోట్లకు చేరుకోగా, నెట్ కలెక్షన్లు రూ.40.60 కోట్ల వసూళ్లు నమోదు చేసింది.

ఓవర్సీస్‌లోనూ ఈ చిత్రానికి అద్భుతమైన స్పందన లభిస్తోంది. శనివారం ఒక్కరోజే ఓవర్సీస్‌లో రూ.25 కోట్లు రాబట్టి, మొత్తం విదేశీ మార్కెట్లలో రూ.70 కోట్ల గ్రాస్ మార్క్ అందుకుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా మొత్తం గ్రాస్ కలెక్షన్లు రూ.117.17 కోట్ల క్లబ్?లో చేరి బాక్సాఫీస్ దండయాత్ర కొనసాగిస్తోంది. ముఖ్యంగా తమిళం, కన్నడతో పోలిస్తే తెలుగులోనే చిత్రానికి ఎక్కువ ఆదరణ లభించడం విశేషం.

దేశవ్యాప్తంగా 5,185 షోలలో ప్రదర్శితమవుతున్న ఈ చిత్రం మే 23న మొత్తం 50.2 శాతం ఆక్యుపెన్సీ నమోదు చేసింది. మలయాళ వెర్షన్‌కు అత్యధికంగా 66.52 శాతం ఆక్యుపెన్సీ నమోదవగా, తమిళ వెర్షన్‌కు 50.69 శాతం స్పందన లభించింది. తెలుగు వెర్షన్ 25.19 శాతం, కన్నడ వెర్షన్ 24.27 శాతం ఆక్యుపెన్సీ నమోదు చేశాయి. ఆడియన్స్ థియేటర్స్?కి




పోటెత్తడం చూస్తుంటే, ‘దృశ్యం 3’ మరో భారీ మైల్ స్టోన్ దిశగా దూసుకెళ్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సినిమాకి ఫస్ట్ డే కంటే సెకండ్ డే మౌత్ టాక్ ఊపందుకుంది. ఈ క్రమంలోనే మోహన్ లాల్ ఫ్యాన్స్ నుంచి థ్రిల్లర్ ఆడియన్స్ వరకు థియేటర్లో క్యూ కడుతున్నారు. అందువల్ల మేకర్స్ సైతం థియేటర్లు పెంచుతూ సినిమాపై మరింత హైప్ పెంచుతున్నారు. దర్శకుడు జీతు జోసెఫ్ ఈసారి కథలో సస్పెన్స్ కంటే జార్జికుట్టి కుటుంబ భావోద్వేగాలపై ఎక్కువ దృష్టి పెట్టారు. చివర్లో దృశ్యం 4కి సంబంధించిన హింట్ కూడా ఇవ్వడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది.

## అవన్నీ ఫేక్... బాధ్యులపై చర్యలు

ఏఐ సహాయంతో అసభ్యకర రీతిలో తన ఫొటోలను సృష్టించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రముఖ కథానాయిక రుక్మిణీ వసంత్. వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘించి ఇలాంటి ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని వ్యాఖ్యానిస్తూ ఎక్స్ వేదికగా ఓ నోట్‌ని విడుదల చేశారు. “ఏఐ ఉపయోగించి సృష్టించిన నా ఫొటోలను ఆన్‌లైన్‌లో వైరల్ చేయడాన్ని నేను, నా టీమ్ గమనించాము. అవన్నీ ఫేక్. ఏఐతో చేసినవి అని స్పష్టం చేయదలుచుకున్నా. ఇలాంటి ఫొటోలు, కంటెంట్‌ని సృష్టించి ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యం. ఈ వ్యవహారాన్ని మేము తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఫొటోలు క్రియేట్ చేసిన వారితో పాటు, ఆన్‌లైన్ వేదికగా వైరల్ చేస్తున్న వారిపైనా న్యాయపరంగా, సైబర్ క్రైమ్ ద్వారా చర్యలు ప్రారంభించాం. ఇలాంటి కంటెంట్, ఫొటోలను ఆన్‌లైన్‌లో పంచుకోవడం మానుకోవాలని ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నా” అని అందులో పేర్కొన్నారు. రుక్మిణి స్విమ్మింగ్ పూల్ వద్ద ఫొటోషూట్ చేయించుకుంటున్నట్లు ఉన్న కొన్ని ఫొటోలు, వీడియోలు వైరలవడంతో దీనిపై రుక్మిణీ తాజాగా స్పందిస్తూ ఫేక్ అని స్పష్టం చేశారు. సినిమా, పబ్లిక్ ఈవెంట్స్‌కు హాజరయ్యే నటీమణులను అభ్యంతరకర రీతిలో జూమ్ చేసి ఫొటోలు తీయడంపై రుక్మిణి ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఆమె ప్రస్తుతం ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న ‘డ్రాగన్’ సినిమాలో నటిస్తున్నారు.



Edited..Printed published and owned by BOMMA PRAVALLIKA and printed at RK PRINTERS HNo .1-7-210/2 Kamla Nagar khapra ECL opposite bus stop HYD 62 Medchal malkhajgiri Telangana and publisher at North Kamla towers flat No 402 North Kamla Nagar near registration office Kapra ECIL Hyderabad Medchal malkajgiri 500062 Telangana editor BOMMA AMARENDER RNI title code: TELTEL.09496..Call 8074671575, email pravallika netha22101988@gmail.com